
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు

అనగనగా ఒక ఊరు... ప్రజలే లేరు...!

అనగనగా ఒక ఊరు.. దాని పేరు బేల్దారివాండ్లపల్లె. పేరుకే పల్లె ఉంది.. ఆ పల్లెలో ఇళ్లు ఉన్నాయి... దేవాలయం ఉంది కానీ ప్రజలు మాత్రం లేరు. ఆ ఊరిలో సరైన వసతులు లేక.. వెళ్లేందుకు సరైన రహదారి లేక.. పాలకుల చిన్నచూపుతో మొదలైన వలసల పర్వంతో మొత్తం ఊరంతా ఖాళీ అయిపోయింది. మనిషి పుట్టినప్పటి నుంచి చనిపోయే వరకు తల్లి, తండ్రిని ఉన్న ఊరిని మరువకూడదని పూర్వీకులు, పెద్దలు చెబుతుంటారు. అలా కాదని ఉద్యోగరీత్యా ఎక్కడికెళ్లినా సొంత ఊరిలో తుదిశ్వాస విడవాలని కోరుకుంటారు. కానీ ఓ ఊరి తలరాతను పాలకులు, అధికారులు, పేదరికం మార్చేస్తుందని ఎవ్వరూ అనుకోలేదు. అలాంటి ఊరు ఒకటి ఉందని, ఆ ఊరి వాళ్లకు తప్ప ఇతరులకు చాలామందికి తెలియదు.


పచ్చని చెట్ల మధ్య ఉన్న బేల్దారివాండ్లపల్లె


ఐదు నెలల క్రితం ఊరి నుంచి వెళ్లిపోయిన కుటుంబానికి చెందిన ఇల్లు

- అభివృద్ధికి దూరమై ఆనవాళ్లుగా మిగిలిన ఊరు
- వలసలకు గంగమ్మ తల్లి, సీతారాములే సాక్ష్యం
- ప్రజలు లేక శిథిలావస్థలో ఇళ్లు

సుండుపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వానరాచపల్లి ఎగువబిడికి ఎగువ భాగంలో బేల్దారివాండ్లపల్లె (చిడతలగుట్ట వడ్డిపల్లి) అనే ఒక ఊరు ఉంది. ఆ ఊరిలో ఒకప్పుడు సుమారు 17 కుటుంబాలు శాశ్వత ఇంటి నిర్మాణాలు చేసుకుని జీవనం సాగించేవి. అయితే ప్రస్తుతం ఆ ఊరు ఖాళీ అయిపోయింది. ఆ ఊరు ఖాళీ అయ్యేందుకు గ్రామంలో సరైన మౌలిక వసతులు లేకపోవడమే ప్రధాన కారణమని అక్కడి నుంచి వలస వెళ్లిన గ్రామస్థులు చెబుతున్నారు. పచ్చని చెట్లు, చుట్టూ పంట పొలాలు, పక్కనే ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన పెద్దగుట్ట. ఇంతటి ఆహ్లాదకరమైన వాతావరణమున్న ఊరు ఎందుకు ఖాళీ చేశారని అక్కడ జీవనం చేసిన వారిని ఎవరినైనా అడిగితే అక్కడ కొలువుదీరిన సీతారాములు, గంగమ్మ తల్లిని అడగమని వాపోతున్నారు. 30 సంవత్సరాల క్రితం మొదలైన ఆ ఊరి ప్రజల వలసలు ఐదు నెలల క్రితం ఓ కుటుంబం ఆ ఊరి నుంచి చివరిగా సుండుపల్లెకు వలస రావడంతో ఆ ఊరి కథ ముగిసింది. ఇలాంటి కష్టం ఏ ఊరికి రాకూడదని ఆ ఊరిలో నివసించి కష్టాలు ఎదుర్కొన్న కుటుంబాలు వాపోతున్నాయి.

కల చెదిరింది...

సుమారు 100 సంవత్సరాల క్రితం మొదలైన ఆ ఊరి ప్రస్థానం ఐదు నెలల క్రితం ఆ ఊరిలో జరిగిన ఒక చావుతో ఆ ఊరి కల చెదిరింది. ఎన్నో ఆశలతో బేల్దారివాండ్లపల్లె (చిడతలగుట్ట వడ్డెపల్లె)లో జీవనం సాగించిన ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు కనిపించలేదు. పాలకులు కరుణిస్తారని, అధికారులు ఆదుకుంటారని ఎన్నో ఆశలతో ఎదురుచూశారు. ఎవ్వరూ ఆదుకోలేదు. సరైన విద్యుత్, తాగునీరు, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. పైగా ఆ ఊరికి రోడ్డు సౌకర్యం కూడా లేదు. ద్విచక్రవాహనాలు తప్ప ఆటోలు సైతం రాని ఆ ఊరి తలరాత ఇక మారదు. ఇక్కడే ఉంటే రానున్న తరాలు కూడా ఇలాగే బతకాలేమో అనే భయంతో 30 సంవత్సరాల క్రితం ప్రారంభమైన కుటుంబ వలసలు ఆ ఊరిని మూగబోయేలా చేశాయి. ప్రస్తుతం ఆ ఊరిలో గతంలో నివసించిన ఆనవాళ్లు తప్ప ఇంకేమీ మిగలలేదు. ఎంతో ఇష్టపడి నిర్మించుకున్న ఇళ్లు మూతపడ్డాయి. కొన్ని ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ ప్రజలు నివసించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కానీ ఊరిలో ఉన్న సీతారాముల ఆలయం, అనంతపురం గంగమ్మ తల్లి ఆలయం దూపదీప నైవేద్యానికి దూరమయ్యాయి.


నివాసం లేక పాడుబడిన గృహాలు

ప్రభుత్వం కరుణిస్తే

కూటమి ప్రభుత్వం కరుణించి అన్ని మౌలిక వసతులు కల్పించి పక్కా ఇళ్లు నిర్మిస్తే ఆ ఊరిలో మా జ్ఞాపకాలు చెరిగిపోకుండా అక్కడే జీవిస్తామని వలస వచ్చిన కుటుంబాలు చెబుతున్నాయి. ఇప్పటికీ చాలామంది అడ్రస్సులు ఆ ఊరి పేరుతోనే ఉన్నట్లు చెబుతున్నారు. అక్కడే వ్యవసాయ భూములు ఉన్నాయి. గతంలో వ్యవసాయం చేశాము. ప్రస్తుతం చాలామంది భూములను వదిలేశారు. ఆ భూములు బీడు భూములుగా మారాయి. అక్కడే మా తాత ముత్తాతల సమాధులు ఉన్నాయి. మా కలలు కూడా అక్కడే ఉన్నాయని అక్కడ జీవనం చేసిన వారు చెబుతున్నారు. ప్రస్తుతం వలస వచ్చిన అందరూ సుండుపల్లె మండల కేంద్రంలో జీవనం సాగిస్తున్నారు. వలస వచ్చిన అన్ని కుటుంబాలు దాదాపు మేస్త్రీలుగా, బేల్దారులుగా, రోజు వారి కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఒకరిద్దరికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు ఉన్నాయి. చాలామంది సొంత ఊరిని వదిలి బాడుగ ఇళ్లలో జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికీ ప్రతి ఏడాది ఫిబ్రవరి నెలలో సొంత ఊరు బేల్దారివాండ్లపల్లెకు వెళ్లి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి బోనాలు సమర్పిస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం కరుణించి అధికారులు చొరవ చూపితే సొంత ఊరికి వెళ్లేందుకు చాలామంది సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు.


ఊరి మధ్యలో సీతారాముల ఆలయం


ఊరి బయట గంగమ్మ ఆలయం

నివాసం ఉంటే వసతులు కల్పిస్తాము

ఆ ఊరి వాళ్లు అక్కడికి వెళ్లి నివాసం ఉంటాము అంటే మౌలిక వసతులు కల్పిస్తాము. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అందరికీ వారు గతంలో నివసించిన చోట పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చేలా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తాము. లేని వారికి కూడా అక్కడే స్థలం కేటాయిస్తాము. అందరూ సొంత ఊరిలో ఉండే విధంగా ఉంటే రోడ్డు సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తాము.

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

మరువలేకున్నాము



30 సంవత్సరాల క్రితం ఊరు వదిలి సుండుపల్లెకు వచ్చాము. సరైన వసతులు లేక చాలా ఇబ్బందులు పడ్డాము. కూటమి ప్రభుత్వం కరుణించి మౌలిక వసతులు కల్పిస్తే సొంత ఊరికి వెళతాము. ఇంటి నిర్మాణం చేయించాలి. మా వ్యవసాయ భూములు ఇక్కడే ఉన్నాయి. పుట్టి పెరిగిన ఊరిని మరువలేకున్నాము.

-పరమేశ్వర, సుండుపల్లె

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- 6.5 మెట్రిక్ టన్నుల ఎరువులు సీజ్
- 30.5 లీటర్ల పురుగు మందుల అమ్మకాలు నిలుపుదల

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. పీలేరు మండల వ్యవసాయాధికారి రమాదేవి ఆధ్వర్యంలో విజిలెన్స్ శాఖ సీఐ ఎస్.చంద్రశేఖర్, అధికారులు ఏ.ఎన్. యల్లప్ప, పవన్, నజీర్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా శ్రీనివాస ఫెర్టిలైజర్స్ దుకాణంలో సీఎంఎస్ (కాల్షియం, మెగ్నీషియం, సల్ఫేట్) 6.5 మెట్రిక్ టన్నుల గోదాము నిల్వకు అమ్మకాలు నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు. జేటీఆర్ ఆగ్రో హైటెల్ఫ్ ప్రైవేట్ దుకాణంలో రూ.36 వేల విలువ గల 30.5 లీటర్ల మందుల అమ్మకాలను నిలిపివేస్తూ నోటీసులు ఇచ్చారు. అలాగే పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించి స్టాక్ రిజిస్టర్లు, ఎరువుల నిల్వల, ధరలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ డీలర్లు పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు నాణ్యమైనవి రైతులకు అమ్మాలని, నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే ఉపేక్షించమని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీకే విక్రయించాలని, ఎక్కువ రేట్లు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

రాజంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం రాజంపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. పారిశుధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో నెంబరు-36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, పారిశుధ్య కార్మికులకు షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలుపరచాలని, వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలని, చట్టబద్ధమైన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేలి రవికుమార్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో ఆన్‌లైన్ ద్వారా నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారని, అటువంటి వారి పట్ల నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కువ మంది యువత అధిక ఆదాయం ఆశతో విదేశీ అవకాశాల పేరుతో మోసానికి గురవుతున్నారని చెప్పారు. మోసగాళ్లు యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఏపీపీఎస్సీ వంటి సంస్థల పేరుతో, ఇతర ఆకర్షణీయమైన సంస్థల పేరుతో ఫేక్ అపాయింట్‌మెంట్ లెటర్లు సృష్టిస్తున్నారన్నారు. ప్రాసెసింగ్ ఫీజు, వీసా చార్జీల పేరిట పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుంటారన్నారు. ఇంటర్వ్యూ లేకుండా నేరుగా లెటర్ పంపిస్తారని, అటువంటి మోసాల పట్ల నిరుద్యోగ యువత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. జాబ్ అప్లికేషన్ పేరిట వ్యక్తిగత డేటా తీసుకుని అక్రమంగా ఉపయోగించడం, బ్యాంక్ డీటెయిల్స్, ఓటీపీలు, ఆధార్‌కార్డ్, పాన్‌కార్డు సమాచారం తీసుకుంటారని వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎక్కడైనా ఆన్‌లైన్ మోసాలకు పాల్పడినా, ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు అక్రమంగా వసూలు చేసినా అటువంటి వారిపై సైబర్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

రాజంపేటలో న్యాయవాదులు, పోలీసుల ర్యాలీ



ర్యాలీలో జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే తదితరులు

రాజంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మధ్యవర్తిత్వపు వారోత్సవాల సందర్భంగా రాజంపేటలో న్యాయవాదులు, పోలీసులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సూచనల మేరకు వారం రోజులుగా జరుగుతున్న మధ్యవర్తిత్వ వారోత్సవాల్లో భాగంగా బుధవారం అదనపు జిల్లా మూడో న్యాయమూర్తి ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ తర్ఫీదు పొందిన మధ్యవర్తుల ద్వారా ప్రజలకు న్యాయ వ్యవస్థలపై అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిని చైతన్యపరచడానికి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా పారా లీగల్ వలంటీర్లు, తర్ఫీదు పొందిన మధ్యవర్తుల ద్వారా ప్రజలకు న్యాయవ్యవస్థపై అవగాహన కల్పిస్తే వారికి ఎంతో ఉపయోగం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి పి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి పి.రాజన్ ఉదయ్‌ప్రకాశ్, ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్‌హెగ్డే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

- గిరిజన సంక్షేమ శాఖ అధికారి తేజశ్విని

రైల్వేకోడూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండలంలోని రెడ్డిపల్లి చెరువు కట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు అండగా ఉంటామని గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.తేజశ్విని తెలిపారు. బుధవారం మండలంలోని శెట్టిగుంట గ్రామంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహారం అందేవిధంగా అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పులి శివశంకర్, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.


మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న తేజశ్విని

భూగర్భ డ్రైనేజీ ఎప్పటికో..

- చిరుజల్లులకే రోడ్లపైకి మురుగు
- ధ్వంసమైన మురుగు కాలువలు

6

నయా దోపిడీ...

- అంకెల రాత పేరుతో ఘరానా మోసం
- రూ.3 వేలు డిపాజిట్‌తో మెంబర్‌షిప్
- లక్షలాది రూపాయలతో పరార్

కురబలకోట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : డబ్బును ఎరగా చూపి ఎలైట్ క్రీప్స్ డేటా సొల్యూషన్స్ సంస్థ భారీ స్థాయిలో దోపిడీకి పాల్పడిన సంఘటన మండలంలోని అంగళ్లలో బుధవారం వెలుగు చూసింది. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అంగళ్లలోని కదిరిరోడ్డు, మదనపల్లె, పీలేరు,చింతామణి తదితర ప్రాంతాలలో గత కొద్ది రోజులుగా కర్ణాటకకు చెందిన ఒక వ్యక్తి ఎలైట్ క్రీప్స్ డేటా సొల్యూషన్స్ సంస్థను ఏర్పాటు చేశారు. అతడు బెంగళూరులో ఉంటూ కార్యకలాపాలను సాగించేవాడు. అంగళ్లలో కొంతమందిని ఆ సంస్థలో చేర్చుకున్నాడు. స్థానికంగా ఉండే ఒక వ్యక్తి, ఆ వ్యక్తికి సమీప బంధువు ఆ కార్యకలాపాలను చూసుకునేవారు. ఈ సంస్థలో ఒకసారి రూ.3 వేలు చెల్లించి మెంబర్‌షిప్ పొందాలి. దానికి ఆ సంస్థలో పనిచేసేవారు వారికి కొన్ని పేపర్లు ఇస్తారు. ఆ పేపర్లలో 10 నుంచి 30 వరకు అంకెలు రాస్తే రూ.15, 31 నుంచి 60 వరకు రాస్తే రూ.20, 61 నుంచి 80 వరకు రాస్తే రూ.25, 81 నుంచి 90 వరకు రాస్తే రూ.30, 91 నుంచి 100 వరకు రాస్తే రూ.50, అనంతరం ఎన్ని నెంబర్లు రాసినా ఒక్కో పేపర్‌కు రూ.50 చెల్లిస్తామని నమ్మబలికారు. అలా ఆశ చూపి చుట్టుపక్కలకు చెందిన సుమారు 200 మందికి పైగా డిపాజిట్ చెల్లించి మెంబర్‌షిప్ పొందారు. మొదట్లో కొంత మంది అంకెలు రాసి తీసుకెళ్లిన పేపర్లకు డబ్బులు చెల్లించారు. అనంతరం ఆ పేపర్‌లో చిన్న చిన్న తప్పులను చూపుతూ డబ్బులు చెల్లించలేదు. అంతేకాకుండా ఇందులో మెంబర్‌షిప్ పొందిన వారు తిరిగి ముగ్గురిని అందులో జాయిన్ చేయిస్తే వారికి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున రూ.3 వేలు చెల్లిస్తామని ఆశ చూపడంతో చైన్‌లింక్ స్కీంలా పాకింది. దీంతో చాలా మంది ఈ స్కీంలో చేరారు. కొద్ది రోజులుగా డబ్బులు చెల్లించకపోవడంతో తాము మోసపోయామని బాధితులు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ సత్యనారాయణ ఆ కంపెనీలో పనిచేస్తున్న సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ విషయం బాధితులకు తెలియడంతో బుధవారం పెద్దసంఖ్యలో స్టేషన్ వద్దకు చేరుకుని తమకు జరిగిన అన్యాయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


పోలీసులను ఆశ్రయించిన బాధితులు


నెంబర్లు రాసేందుకు డిపాజిట్‌దారులకు ఇచ్చిన పేపర్లు

పీ-4తో దీర్ఘకాలిక ఫలితాలు

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీ-4 కార్యక్రమం దీర్ఘకాలిక ఫలితాలు ఇవ్వబోతోందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నిదియాదేవి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, సీపీవో వెంకట్, డీపీవో రాధమ్మ, నియోజకవర్గ ప్రత్యేక అధికారులతో కలిసి పీ-4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్‌నర్‌షిప్)పై ఎంపీడీవోలు, యూనిట్ల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ముందుగా రాష్ట్ర సమగ్ర టీం సభ్యురాలు రంజుకుమారి పాపులేషన్ మేనేజ్‌మెంట్, పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌కు సంబంధించి కలెక్టర్, అధికారులకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రాన్ని సాధించడమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. అన్నమయ్య జిల్లా జీడీపీలో 23వ స్థానంలో ఉన్న ప్రాంతమని పీ-4 కార్యక్రమం ఈ జిల్లాకు చాలా ఉపయోగకరమని తెలిపారు. స్వర్ణాంధ్ర విజన్ మానిటరింగ్ డాష్ బోర్డు గ్రామ స్థాయిలో తయారు చేస్తారని, మండల, మున్సిపాలిటీ పరిధిలో పరిశీలిస్తారని చెప్పారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, ప్రత్యేక అధికారులు పర్యవేక్షణాధికారులుగా ఉంటారని, జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి ఛైర్మన్‌గా, పార్లమెంట్ సభ్యులు వైస్ ఛైర్మన్‌గా, కలెక్టర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్‌గా ఉంటారని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, యూనిట్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

భూగర్భ డ్రైనేజీ ఎప్పటికో..

- పీలేరులో చిరుజల్లులకే రోడ్లపైకి మురుగు
- ధ్వంసమైన మురుగు కాలువలు
- దుర్వాసన, దోమలతో జనం సతమతం
- దుర్గంధం నడుమ ఆర్టీసీ బస్‌స్టేషన్

పీలేరు పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా.. అందుకనుగుణంగా వసతులు సంతరించుకోవడంలో వెనుకబడి ఉంది. ఎన్నికల సందర్భంగా నాయకులు గుప్పించే హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో జనం సమస్యలతో సహజీవనం చేయాల్సి వస్తోంది. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎన్నికల సందర్భంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, 2017లో అప్పటి పంచాయతీ రాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోలేదు. దీంతో పలు వీధులు దుర్గంధ భూయిష్టంగా మారాయి. ఏళ్లు గడచి పోతున్నాయి తప్ప భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు వైపు ఒక్క అడుగు కూడా పడడం లేదు.


ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై మురుగు ప్రవాహం

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉండగా, 150కి పైగా వీధులున్నాయి. శరవేగంగా పట్టణం విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడంతో దోమల బెడద అధికమై జనం రోగాల బారిన పడుతున్నారు. అవసరం మేరకు. పట్టణంలో మురుగు కాలువలు నిర్మించక పోగా, ఉన్న వాటిలో క్రమబద్ధత లేకపోవడంతో రోజురోజుకూ సమస్య జటిలంగా మారుతోంది. నాలుగు చినుకులు పడితే మురుగు రోడ్లపై పరుగులు పెడుతోంది. ఆర్టీసీ బస్ స్టేషన్, ఎస్‌వీ మహల్, సుధాసుధీర్ వీధి, ఇందిరానగర్, వారపు సంత మార్గం, బండ్లవంక, మేకనోనికాలువ రోడ్, కట్టుకాలువ వీధి, రాజీవ్‌నగర్, సాయిరాం వీధి తదితర ప్రాంతాలలో మురుగునీరు రోడ్లపైకి రావడం పరిపాటిగా మారింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం దుర్గంధానికి నిలయంగా మారింది.

పట్టణంలో అక్రమకట్టడాలు అధికం కావడంతో పలు ప్రాంతాల్లో మురుగుకాలువలు మూసుకుపోయి సమస్య మరింత జటిలంగా తయారైంది. కొన్ని ప్రాంతాలలో మురుగు కాలువలను పూడ్చివేశారు కూడా. దీంతో మురుగు ముందుకు పోయే మార్గం లేకుండా పోయింది. మరికొన్ని చోట్ల మురుగు కాలువలు నిర్మించకుండా సీసీ రోడ్లు మాత్రమే వేసి చేతులు దులుపుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.


సంప్ నుంచి రోడ్డు పైకి వస్తున్న మురుగు


అండర్ డ్రైనేజీతోనే సమస్య పరిష్కారం



వర్షం వస్తే పట్టణంలోని పలు చోట్ల మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో పాదచారులు, వ్యాపారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు పార్టీలకు అతీతంగా అందరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలి.

- ఆర్. శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి..



పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అండర్ డ్రైనేజీ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పూర్తి స్థాయి నివేదిక రావడానికి మరికొంత సమయం పడుతుంది.

- లతీఫ్‌ఖాన్, డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జి ఈవో

ఇరుకైన రోడ్లు.. ఆపై ఆక్రమణలు..

ఇళ్ల ముందున్న రోడ్డును ఆక్రమించి సంపులు, మెట్లు నిర్మించుకోవడంతోపాటు, మొక్కలు నాటుకోవడంతో వీధులన్నీ ఇరుకుగా మారాయి. దీంతో వాహన చోదకులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం మధ్యలో నుంచి వెళుతున్న అయ్యప్పనాయుని చెరువు సప్లై చానల్‌కు మురుగు నీరు మళ్లించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.


అధ్వానంగా మురుగుకాలువ

పీజీఆర్‌ఎస్‌లో ఫార్మసీ విద్యార్థుల ఫిర్యాదుపై
సోషల్ వెల్ఫేర్ డీడీ విచారణ


కళాశాల డైరెక్టర్లను విచారణ చేస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ కృష్ణ

మదనపల్లె టౌన్, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): కళాశాల యాజమాన్యంలోని వర్గాల మధ్య విభేదాల కారణంగా తమ సర్టిఫికెట్లకు భద్రత లేకుండా పోయిందంటూ కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో, బుధవారం సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.కృష్ణ కళాశాలలో ఓ వర్గానికి చెందిన సొసైటీ సెక్రటరీ, ప్రిన్సిపాల్ శశివర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు బి.శ్యామలమ్మ, గోవర్ధన్‌రెడ్డి, ఎర్రంరెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, అమరావతి, అధ్యాపకులను, విద్యార్థులను విడివిడిగా విచారణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు మాటాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రెండు కంతులు విడుదల చేసినా తమ కళాశాల విద్యార్థులకు జమ కాలేదన్నారు.

మరో వర్గానికి చెందిన డైరెక్టర్లు అడ్డుపడటంతోనే ఈ సమస్య వస్తోందన్నారు. దీంతో అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం కష్టంగా ఉందని వాపోయారు. విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల ఆలస్యం కావడంతో ఫీజులు చెల్లించేందుకు తాము అప్పులు చేయాల్సివస్తోందన్నారు. డీడీ కృష్ణ మాట్లాడుతూ విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యార్థులు నష్టపోకూడదని యజమాన్యానికి సూచించారు. ఈ విద్యా సంవత్సరం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో గంగిరెడ్డి, వార్డెన్ రాంప్రసాద్, డీఎస్‌డబ్ల్యూవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏక పక్షంగా విచారణ తగదు

సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఏకపక్షంగా వ్యవహరించడం తగదని ఆ కళాశాల కరెస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల గేటు వద్ద రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లికార్జునరెడ్డి, శశికుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డితో కలసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త సొసైటీని ఏర్పాటు చేసుకుని కళాశాల నిర్వహించామన్నారు. ఈ విషయమై హైకోర్టులో వివాదం నడవగా తమకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రెండు నెలల క్రితం తమ ప్రత్యర్థి వర్గం కళాశాలను దౌర్జన్యంగా ఆక్రమించుకుందన్నారు. ఈ విషయాలన్నీ తాము డీడీ దృష్టికి తీసుకెళ్లేందుకు వస్తే కళాశాల గేట్లు మూసివేసి దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నా సాంఘిక సంక్షేమ డీడీ కృష్ణ విచారణకు రావడం హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అన్నారు.

డీడీ ఒక వర్గాన్ని మాత్రమే విచారణ చేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఏ విధంగా నష్టం కలిగించినా తాము ఊరుకోమని హెచ్చరించారు.

కల్తీ ఎరువుల స్వాధీనం


పురుగు మందులను స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

కలికిరి, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో రెండు దుకాణాల్లో భారీగా కల్తీ రసాయనిక ఎరువులు పట్టుబడ్డాయి. విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం కలికిరిలోని రెండు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ ట్రేడర్స్‌లో 12 టన్నుల కల్తీ ఎరువులు పట్టుబడగా వాటి విలువ రూ.2.31 లక్షలుగా నిర్ధారించారు. సిరి అగ్రో మార్ట్‌లో దాదాపు రూ.80 వేలు విలువచేసే టన్ను ఎరువులు పట్టుబడ్డాయి. ఈ రెండు దుకాణాల్లో గుర్తించిన ఎరువులను విక్రయించకుండా చర్యలు తీసుకున్నారు. అక్కడికి సమీపంలోని క్రాంతి ట్రాన్స్‌పోర్టులో దాదాపు ఆరు నెలల నుంచి నిల్వ ఉంచిన రూ.92 వేలు విలువ చేసే ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఉదయం పీలేరులో విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ముందు జాగ్రత్తగా మూసేశారు. దీంతో అధికారులు కేవలం రెండు దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేయ గలిగారు. ఈ దాడుల్లో తిరుపతి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కల్యాణదుర్గం వ్యవసాయ శాఖ ఏడీ ఏఎన్.యల్లప్ప, స్థానిక వ్యవసాయాధికారులు ఎం.హేమలత, పవన్ కుమార్, వీఆర్వో ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు


రాజశేఖర్

పెద్దతిప్పసముద్రం జూలై (ఆంధ్రజ్యోతి) : తమ కుమారుడు అదృశ్య మయ్యాడని రాపూరివాండ్లపల్లె గ్రామపంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన కృష్ణమ్మ పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 9వ తేదీన వేంకటేశ్వర స్వామి దర్శనానికని తిరుమలకు వెళ్లిన తన కుమారుడు రాజశేఖర్ తిరిగి రాలేదని, మొలకలచెరువుకు వెళ్లి అక్కడి నుండి రైలులో తిరుమలకు వెళతానని చెప్పి వెళ్లాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. వివిధ ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని, తమ కుమారుని గుర్తించి తమకు అప్పగించాలని ఆమె ఫిర్యాదులో విన్నవించారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. స్థానిక చెన్నారెడ్డి వీధిలో కాపురముంటున్న వెంకటేష్ ఇంటి ముందు పార్క్ చేసిన బుల్లెట్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మల్లెలవీధిలో కాపురం ఉంటున్న నజీర్ ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని, తిరుపతి మార్గంలో మరో బుల్లెట్ చోరీకి గురైంది. దీంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీలోని బలిజపల్లె క్రాస్ వద్ద గత నెల 21న గుర్తుతెలియని వాహనం ఢీకొని దిగువపల్లెకు చెందిన ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే సంఘటనలో తీవ్రంగా గాయపడిన కృష్ణమ్మ అనే మహిళ మదనపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులుతెలిపారు.

డ్రిప్ పైపులు చోరీ..

పెద్దతిప్పసముద్రం జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తన పొలంలోని డ్రిప్ పైపులు చోరీకి గురయ్యాయని స్థానిక బెస్తవీధికి చెందిన బెస్తగవ్వల మంజునాథ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక రంగసముద్రం రోడ్డులోని తమ పొలంలో అమర్చిన డ్రిప్ పైపులను ఈ నెల 13వ తేదీ రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ తాను అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పైపులను చోరీ చేశారని, గతంలో కూడా రెండు సార్లు ఇలాగే జరగడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని స్థానిక పోలీసులను కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఐషర్ వాహనం ఢీకొని ద్విచక్రవాహన దారుడు గాయపడ్డాడు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివారాల మేరకు బుధవారం సాయంత్రం పీలేరు నుంచి బెంగళూరు వెళుతున్న ఐషర్ వాహనం తురకపల్లె సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై వెళుతున్న షేక్ సయ్యద్ సాహెబ్ కాలు విరిగింది. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కుమారుడు ఖాదర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వం'పై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మధ్యవర్తిత్వం అన్న అంశంపై వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు, పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ మాట్లాడుతూ ప్రధానంగా వ్యాజ్యానికి ప్రత్యామ్నాయంగా మధ్యవర్తిత్వాన్ని ఎంచుకుని కక్షిదారులతో చర్చించి, కేసులకు పరిష్కార మార్గం చూపాలన్నదే సుప్రీం కోర్టు భావన అని తెలిపారు. న్యాయస్థాన పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివాదాలు, ప్రమాద క్లైంలు, చెక్‌బౌన్స్ కేసులు, గృహ హింస, క్రిమినల్ కేసులు, సర్వీసు విషయాలు, తదితర కేసుల విషయంలో కక్షి దారులకు అవగాహన కల్పిస్తూ వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఉర్దూ హైస్కూల్ వద్ద నుంచి న్యాయవాదులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, సెక్రటరీ రమణ, న్యాయవాదులు, ద్వారకనాథరెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, జుడిషియల్ సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ' కార్యక్రమం పరిశీలన


కురిజల గ్రామస్తులతో కేంద్ర బృందం

రామసముద్రం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిజల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమాన్ని బుధవారం కేంద్రం బృంద సభ్యుడు హేమంత్ పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి చెత్త పొడి చెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ సందర్శించి కంపోస్ట్ తయారీ, మరుగుదొడ్ల వినియోగంపై గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, పారిశుధ్య నిర్వహణపై సర్వే నిర్వహించి ఆయా గ్రామ పంచాయతీలకు ర్యాంకులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.మంగమ్మ, ఎంపీడీవో గఫూర్, మదనపల్లి నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి నరసింహులు, ఇంజనీరింగ్ సహాయకులు శ్రావణి, వెల్ఫేర్ సహాయకులు సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్ రత్నమ్మ, సంఘమిత్ర భూలక్ష్మి, ఏఎన్ఎం రుక్మిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు, జరిమానా..


ముద్దాయిలతో సిద్ధవటం పోలీసులు

సిద్ధవటం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగిపై హత్యాయత్నం చేయడంతోపాటు, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన కేసులో రాజోలి మల్లికార్జున, రాజోలి రత్నమ్మకు రెండేళ్ల ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం బద్వేల్ సీనియర్ సివిల్‌జడ్జి వైజే పద్మశ్రీ తీర్పునిచ్చారని సిద్ధవటం ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2018 డిసెంబరు 29న రాజోలి మల్లికార్జున, అతని తల్లి రత్నమ్మ జూనియర్ అసిస్టెంట్ గుమ్మళ్ల రామకృష్ణారెడ్డిపై గట్టిగా కేకలు వేసి కోర్టు మర్యాదకు భంగం కలిగించడంతోపాటు, అడ్డువచ్చిన కోర్టు కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని పిడిగుద్దులు గుద్ది దాడిచేయడంతో అతను కింద పడిపోయాడరన్నారు. కుర్చీతో కానిస్టేబుల్ తలపై దాడికి యత్నించాడన్నారు. అప్పటి సిద్ధవటం ఎస్ఐ బి.అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేశారన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుని తరపున అదనపు పీపీ శ్రీనివాసులు వాదనలు వినిపించారన్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సకాలంలో ప్రవేశపెట్టి నేరం రుజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించినట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రైవర్ల ఘర్షణ : 'తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్' ధ్వంసం


గాయపడిన డ్రైవర్, ధ్వంసమైన వాహనం

మదనపల్లె అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల ఘర్షణతో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బురకాయల కోటకు చెందిన రమణయ్య కుమారుడు శ్రీనివాసులు(37) మదనపల్లెలో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం వాహనాన్ని ఆస్పత్రిలో పార్కింగ్ చేసే సమయంలో పృథ్వీరాజ్ అనే డ్రైవర్ మద్యం మత్తులో శ్రీనివాసులుతో గొడవ పెట్టుకుని, రాయితో దాడిచేసి గాయపరిచాడు. నిలిపి ఉన్న తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం అద్దాలను పగలకొట్టి చంపుతాయని బెదిరించాడు. ఈ గొడవలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను మదనపల్లె ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆ మేరకు రెండో పట్టణ పోలీసులు విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

నిలిపి ఉంచిన కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

మదనపల్లె అర్బన్, జూలై 16: మండలంలోని వేంపల్లె గ్రామం సమీపంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్ద నిలిపి ఉంచిన కారు బుధవారం రాత్రి దగ్ధమైంది. ఈ ఘటన జరిగిన సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు. కాగా, కారు వద్ద ఎవరూ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలను, ఇతర వివరాలను సేకరించారు. మదనపల్లె పట్టణం, రెడ్డీస్‌కాలనీకి చెందిన రామాంజులరెడ్డి కారులో తన తమ్ముడిని కర్ణాటక రాష్ట్రం, చింతామణిలో దింపి తిరిగి వస్తుండగా ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి సమీపంలోకి రాగానే హఠాత్తుగా కారులోంచి మంటలు అంటుకోవడంతో కారు డ్రైవర్ పీరాతో కలసి కారు నుంచి దిగిపోయారని, ప్రమాదవశాత్తూ ఈ సంఘటన జరిగినట్లు శివప్ప తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దమండ్యం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6న పెద్దమండ్యం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) తల్లి మదనపల్లికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం గాలివీడుకు చెందిన రామకృష్ణ(19) గమనించాడు. వెంటనే ఇంట్లోకి వెళ్లి గడియ వేసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అదే సమయంలో బాలికకు వరసకు పెద్దనాన్న అయిన వ్యక్తి ఇంటి తలుపులు కొట్టడంతో రామకృష్ణ కిటికీలోనుంచి నుంచి దూకి పారి పోయాడు. జరిగిన సంఘటనను బాలిక పెదనాన్నకు చెప్పింది. తరవాత మదనపల్లి నుంచి ఇంటి కొచ్చిన తల్లికి కూడా వివరించింది. ఈ నెల 15వ తేదీన బాలిక తల్లి పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పీలేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పీలేరులో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ పీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు-తిరుపతి రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ అదాలత్ ఛైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, సభ్యులుగా మధుకుమార్, విజయలక్ష్మి వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు. పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఏవైనా అపరిష్కృత విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని ఆయన ప్రజలకు తెలియజేశారు.

బిట్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్స్


బండపల్లి సమీపంలోని బిట్స్ కళాశాల (ఇన్‌సర్ట్) కళాశాల ఛైర్మన్ మన్నూరు భాస్కర్

రామాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు అత్యధిక డిమాండ్ ఉందని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల ఛైర్మన్ మన్నూరు భాస్కర్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి తమ కళాశాలకు 60 సీట్లు కేటాయించగా, మేనేజ్‌మెంట్‌కోటాలో మరో 60 సీట్లకు అడ్మిషన్ ఇస్తున్నామని కళాశాల విజయవాడ, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు తదితర పట్టణాల్లో ఏ ఏ కోర్సులు ఉన్నాయో ప్రస్తుతం రాయచోటి సమీపంలోని బిట్స్ కళాశాలలో ఆ కోర్సులన్నీ ఉన్నాయన్నారు. తమ కళాశాలలో ఫీజులు మధ్య తరగతి విద్యార్థులకు అనుకూలంగా ఉంటాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులు ఉండగా ఏఐకి భారీ డిమాండ్ ఉందన్నారు.

సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో విజయకేతనం


ఇంజనీరింగ్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బిట్స్ కళాశాల విద్యార్థులు

ఇంజనీరింగ్ మొదటి, రెండవ సెమిస్టర్ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. కంప్యూటర్ అండ్ సైన్స్ విభాగంలో సుమారు 88 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 86.6 శాతం మార్కులు సాధించి సాజిదా మొదటి ర్యాంకు , 80.5 శాతంతో సానతాబసుమ్ రెండవ ర్యాంకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సాయిదర్శిని 80.5 శాతంతో మొదటి ర్యాంకు, జాహ్నవి 79 శాతంతో రెండవ ర్యాంకు, వెంకటేశ్ 78.5 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, కంప్యూటర్‌సైన్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ టీ. వెంకటరత్నం, ఏఐహెచ్‌వోడీ ప్రొఫెసర్ సమీయా సుల్తానాలు అభినందించారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి


ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి


వీరాంజనేయులు మృతదేహం

చిన్నమండెం, జూలై16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరకొరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశాపురం గ్రామ పంచాయతీకి చెందిన ఉసిరికాయల వీరాంజనేయులు (45), శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై రాయచోటి నుంచి కేశాపురానికి వెళుతుండగా దేవపట్ల క్రాస్ వద్ద మదనపల్లి డిపోకు చెందిన ఆర్డినరీ బస్సు ఢీకొంది. దీంతో తలకు గాయమై వీరాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులను తిరుపతిలోని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు.. జేడీఏ



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న జేడీఏ చంద్రానాయక్

వేంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులందరికీ సరిపడా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వల ఉన్నాయని, ఎక్కడ కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రా నాయక్ తెలిపారు. పంటల సాగులో రైతులు అధిక మోతాదులో యూరియాను ఉపయోగించడం మానుకోవాలని, అధిక మోతా దులో యూరియా వాడకం వలన చీడపీడలు ఎక్కువ అవుతాయ న్నారు. వేంపల్లె వ్యవసాయ కార్యాలయంలో బుధవారం పొలం పిలు స్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరూ తమ పొలంలో భూసారపరీక్ష చేయిం చుకొని పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని తెలిపారు. వరి సాగు చేసే రైతులు పాతరకాలను వదిలేసి కొత్తవంగడాలైన ఆర్ఎస్ ఆర్ 1502, కేఎన్ఎమ్ 1632 సాగు చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో ప్రత్యామ్నయంగా కంది వేసుకోవాలని సూచించారు. అరటి పంటకు యూరియా వేయడం వల్ల గాలులకు త్వరగా పడిపోతా యని, దిగుబడి తగ్గుతుందని తెలిపారు. 80శాతం సబ్సిడీతో డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ అధికారిని కలిసి పొంద వచ్చన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, ఏఈఓ మల్లికార్జున, వినోద్, రైతులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్డు పనులు నాణ్యతగా చేపట్టండి



వాటర్‌షెడ్డు పనులను పరిశీలిస్తున్న
పీడీ ఆదిశేషారెడ్డి, రాష్ట్ర విజిలెన్స్ అధికారి గోపినాధ్

బి.కోడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాటర్‌షెడ్డు పథకం కింద చేస్తున్న పనులను నాణ్యతగా చేయాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం పెదుళ్లపల్లె, మేకవారిపల్లె, ప్రబ లవీడు గ్రామ పంచాయతీల్లో వాటర్‌షెడ్డు పథకం కింద చేస్తున్న పనులు, చేసిన పనులను రాష్ట్ర విజిలెన్స్ డైరెక్టర్ గోపినాధ్ పరిశీలిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డకౌట్ గుంతలకు గజ్జి రాయి కటకం వేయరాదని, తెల్లరాయి, ఫైటింగ్‌రాయి మాత్రమే వాడాలన్నారు. వర్షం నీరు దిగువకు పారే వంకలో మాత్రమే చెక్ డ్యాంలు, డకౌట్ గుంతలు నిర్మించాలని, గుట్టల మీద, దిమ్మెల మీద చెక్‌డ్యాంలు, డకౌట్ గుంతలు నిర్మించరాదన్నారు. అలా చేస్తే బిల్లులు రావని, పనులు పక్కాగా నాణ్యతగా చేపట్టాలని తెలిపారు. అలాగే రైతులు వాటర్‌షెడ్డు పథకం కింద తమ తమ పొలాల్లో వాలు ప్రదే శంలో డకౌట్ గుంతలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వాటర్ షెడ్డు పథకం కింద జరిగే పనులను వాటర్‌షెడ్డు అధికారులు దగ్గ రుండి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్డు ఏపీవో వేణు గోపాల్‌రెడ్డి, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

భార్య, బామ్మర్ది చేతిలో వ్యక్తి మృతి



మృతి చెందిన సుబ్బరాయుడు

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యతో గొడవ పడుతున్న వ్యక్తిని అతని బావమరిది అడ్డుకోబోయి గట్టిగా తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కడప నగరం ఎర్రముక్కప ల్లెలోని పల్లావారి వీధిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు. ప్రొద్దుటూరు పట్టణంలోని ఇసుకలదిన్నె గ్రామా నికి చెందిన దేవాంగుల సుబ్బరాయుడు (30) పదేళ్ల క్రితం అక్క కుమార్తె హర్షితను వివాహం చేసుకున్నారు. వీరికి 8 సంవత్సరాల కొడుకు, 7సంవత్సరాల పాప ఉంది. సుబ్బరాయుడు గ్రానైట్ పను లు చేసుకుంటూ ఎర్రముక్కపల్లెలోని పల్లావారి వీధిలో ఉంటు న్నారు. సుబ్బరాయుడు అక్క కూడా సమీపంలో ఉంటున్నారు. సుబ్బరాయుడు రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతుండే వాడు. మంగళవారం రాత్రి కూడా ఫుల్లుగా మద్యం తాగి భార్య హర్షితతో గొడవ పడుతుండగా ఆమె తమ్ముడు హరిక్రిష్ణ ఇంట్లోకి వచ్చి బావకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో అతన్ని కొట్టేందుకు వెళ్లగా వారిరువురూ గట్టిగా సుబ్బరాయుడును తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కాగా హరిక్రిష్ణను, హర్షితను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు?

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంతో పాటు పలుచోట్ల చోరీలకు పాల్పడ్డ చైన్ స్నాచర్లు అదుపులోకి తీసుకున్న ట్లు సమాచారం. ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్ చేసు కుని వారి మెడలోని బంగారు గొలుసులు చోరీ చేసే ముగ్గురిని పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించినట్లు తెలుస్తోంది. కడప జిల్లాతో పాటు పలుచోట్ల వీరు గొలుసు దొంగతనాలకు పాల్పడి దోచుకున్న బంగారాన్ని ఎక్కడెక్కడ పెట్టారని విషయాలపై పోలీ సులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రెండు మూడురోజుల్లో వీరిని అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

విద్యుత్తుషాక్‌తో వ్యక్తి మృతి



బద్వేలుటౌన్, జులై 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సోను (28) విద్యుత్తుషాక్‌తో మృతి చెందా డు. పోలీసుల వివరాల మేరకు.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మృతుడు మహమ్మద్ సోను ధర అనే అని మేట్ కంపెనీ ద్వారా మున్సిపాలిటీ లోని డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు ఆపరేటర్‌గా విధులకు వచ్చాడు. ఆ యంత్రాన్ని సరిచేస్తున్న సమయంలో బోర్డు దగ్గర కేబుల్ వైరు షాక్‌కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి

- వన్ కె వాక్‌లో జిల్లా ప్రధాన జడ్జి యామిని



వన్ కె వాక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ ప్రాముఖ్య తను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని డీఎల్ఎస్ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్ నుంచి నగరంలోని అంబే డ్కర్ సర్కిల్ వరకు.. అక్కడ నుంచి తిరిగి న్యాయసేవా సదన్‌కు మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతపై వన్ కే వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై జూలై 10 నుంచి 16 వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. నైపుణ్యంతో కక్షిదారుల సమస్యలను పరిష్కరించుకునే అవకాన్ని కల్పించే ప్రత్యేక పక్రియే మధ్యవర్తిత్వమన్నారు. ప్రతి ఒక్కరు అవగాహనను పెంపొందిం చుకొని తద్వారా కేసులను సులువుగా పరిష్కరించుకోవాలన్నారు. మధ్యవర్తి అంగీకార పత్రంలో షరతులను కక్షిదారులకు వివరిం చి.. ఖరారు చేసి ఒప్పంద పత్రాన్ని తయారు చేస్తారన్నారు. మధ్య వర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, కేస్ స్టడీస్, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు తదితర విషయా లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ, అరవ, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తులు గరికపాటి దీనబాబు, ఎన్.శాంతి, జి.రమేష్‌కుమార్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, జడ్జిలు కె.ప్రత్యూషకుమారి, జి.సి. ఆసిఫా సుల్తానా, కె.భార్గవి, ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్, జి.విజయ లక్ష్మి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సెక్రటరీ చంద్రవదన, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కడప బార్ అసోసియేషన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ మాట్లా డారు. అలాగే న్యాయసేవా సదన్‌లో హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం, చెల్లింపు తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంబం ధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో శ్రావణమాస ఉత్సవాలు విజయవంతం



గండి ఉత్సవాల బుక్‌లెట్లను విడుదల చేస్తున్న దృశ్యం

చక్రాయపేట,జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రంలో శ్రావణమాసోత్సవాలను అన్ని శాఖల అధికారుల సహకారంతో విజయవంతం చేస్తామని ఆలయ సహాయ కమి షనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలు పేర్కొన్నారు. బుధవారం దేవస్థాన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల బుక్‌లెట్‌లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రావణ మాస ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తారన్నారు. వారికి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసేందుకు అన్ని శాఖ ల అధికారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా చలువ పందిళ్ల, క్యూలైన్‌లు, పాపాఘ్ని నదిలో భక్తులు స్నానాలు చేసేం దుకు షవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానంతో పాటు భక్తుల అన్నదాన కార్యక్రమాలు విరివిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య, ఆలయ మాజీచైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, ఆలయ సూప రింటెండెంట్ సుబాష్, వైద్యాధి కారి వాణి, సీఐ ఉలసయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో టెండర్లు : గండి క్షేత్రంలో ఏడాది పాటు పూలు విక్రయిం చుకునేందుకు, టోల్‌గేట్ వసూలుతో పాటు శ్రావణ మాసం సంద ర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణకు సంబంధించి బుధవారం టెండర్లు నిర్వహించారు. పూల విక్రయానికి తొమ్మిది మంది పోటీ పడగా వేంపల్లె మండలం కత్తులూరు గ్రామానికి చెందిన టి.మల్లి కార్జున రూ.20,05,000 పాట పాడి టెండర్‌ను దక్కించు కున్నారు. అయితే టోల్‌గేట్ వసూలుకు ఎవరూ ముందుకు రాలేదు. అలాగే శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేసే హక్కు నకు సీల్డ్‌టెండర్లు ఎవరు దాఖలు చేయలేదని, ఈ రెండు వాటికి టెండర్లు నిలిపివేశామని, ఈనెల 23న మళ్లీ నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు.

ఎరువుల తయారీ కేంద్రాలు, దుకాణాల్లో తనిఖీలు





కడపలో ఎరువులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం, మైదుకూరులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కడప రూరల్, జూలై16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఎరు వుల తయారీ కేంద్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల హోల్‌సేల్ దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ ఎస్.వెంకటే శ్వర్లు, కడప జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో ఎస్.గోవర్ధన్, మం డల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సంయుక్త బృందం ఆక స్మిక తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో రిజిష్టర్లను, స్టాక్ నిల్వల ను పరిశీలించారు. కాలం చెల్లిన ఉత్పత్తులు ఏమైనా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని 32 లక్షల విలువల గల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు డీలర్లతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, అనుమతి కలిగిన ఎరువులను మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి రోజు స్టాక్ బోర్డు, ధరల పట్టికను అప్డేట్ చేసి ఉంచాలన్నారు. లైసెన్సులు లేకుండా వ్యాపారా లావాదేవీలు కొనసాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చారించారు.

మైదుకూరు మండలంలో...

మైదుకూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరు వుల, పురుగుల మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లిఖార్జున్‌రావు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. దుకాణాలలో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. జీవి సత్రంలోని శ్రీశక్తి ట్రేడర్స్, శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్, శ్రీనివాస ట్రేడర్స్, తిరుమల ఆగ్రో ఏజెన్సీస్‌లలో రికార్డులను అప్డేట్ చేయనం దుకు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ డీఆర్‌సీ ఏడీఏ సంగు వెంకటేశ్వర్ రావు, ఏ డీఏ క్రిష్ణమూర్తి, మండల వ్యవసాయశాఖ అధికారి బాలగంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి హంతకులను శిక్షించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని గంటికో టలో దారుణంగా హత్య చేసిన హంతకులను శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వ ర్యంలో వైష్ణవిని హత్య మిస్టరీని ఛేదించి హంతకులను పట్టుకోవా లని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థి వైష్ణవి హత్య లాంటి సంఘటనలు జరగడానికి కారణాలు బహిర్గతం కావాల్సిన అవసరం వుందన్నా రు. కార్యక్రమంలో గుర్రమ్మ ప్రమీల తదితర ఐద్వానాయకులు పాల్గొన్నారు.

సాగునీరు వదలడంలో అధికారుల నిర్లక్ష్యం : ఎంపీ

పులివెందుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని సాగునీటి అధికారులు ఏడాది కాలంగా నిర్లక్ష్యం వహించారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరో ఎంచారు. బుధవారం మినీ సెక్రటేరి యట్‌లోని నీటి పారు దలశాఖ డీఈని ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని చెరువులకు నీటిని అందించే విషయమై చర్చించారు. ఎర్రబల్లె ఎరువు, భూమయ్యగారిపల్లె చెరువు లకు నీరివ్వాలని కోరారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో నీటిపారుదల వ్యవస్థ సక్ర మంగా లేదన్నారు. ఏడాదిగా నియో జకవర్గంలోని చెరువు లను నీటితో నింపే కార్యక్రమం సక్రమంగా సాగడం లేదన్నా రు. గండికోట, పైడిపాళెం ప్రాజెక్టులతో పాటు సీబీఆర్‌లో పుష్కలంగా నీరు ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు కూడా నిండు కుండలా ఉందన్నారు. అన్ని ప్రాజెక్టులు నీటితో కళకళలా డుతున్నా పులివెందుల నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. యర్రబల్లె చెరువుకు నీరు ఇవ్వకపోవడంతో చుట్టుపక్కల పది గ్రామాలపై ఈ ప్రభావం చూపుతుందన్నారు. సత్వరమే చెరువులకు నీరందించి రైతు లను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసీపీ నాయకులు బలరామిరెడ్డి, జడ్పీటీసీ బయపురెడ్డి, సాంబశివారెడ్డి తదితరులలు పాల్గొన్నారు.

నెల్లూరుపై అనంత జట్టు గెలుపు

- కర్నూలు, కడప మ్యాచ్ డ్రా
- మల్టీ డే క్రికెట్ టోర్నీ



రోహిత్‌రోషన్, కమృద్దీన్, ప్రమోద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రమోద్ కుమార్ ఆరు వికెట్లతో చెలరేగడంతో మల్టీ డే క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టుపై అనంత జట్టు విజయం సాధించింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు బుధవారం మూడోరోజు అనంతపురం నగరంలోని అనంత క్రీడాగ్రామంలో కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు ఓవర్‌నైట్ స్కోరు 243/5తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 319 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్ ప్రమోద్‌కుమార్ 6 వికెట్లతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 44.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 315 పరుగులు సాధించింది. రోహిత్‌రోషన్ హాఫ్ సెంచరీ(46 బంతుల్లో 72)లో ఆకట్టుకున్నా డు. దీంతో అనంత జట్టు 4వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మరో గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 105 ఓవర్లలో 459 పరు గులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 74.1 ఓవర్లలో 268 పరుగులకు 7వికెట్లు కోల్పోయింది. కర్నూలు బ్యాటర్ కమ్ము ద్దీన్ సెంచరీ (111)తో జట్టును ఆదుకున్నాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి



ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్‌స్టేషన్‌లో
పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

కడప ఎర్రముక్కపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వినియోగ దారుల విద్యుత్ సమస్యపై వెంటనే స్పందించాలని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెం ట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నా రు. బుధవారం కడప ఇండ స్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో సబ్‌స్టేషన్, లైన్లు ట్రాన్స్ ఫార్మర్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. అనంతరం రూర ల్ సబ్ డివిజన్ విభాగం సిబ్బం దితో, అధికారులతో సమా వేశం నిర్వహించారు. వేల మందికి ఉపాధికల్పించే పారిశ్రామికవాడలో ఒక్క అంత రాయం ఏర్పడినా ఉత్పత్తి అనుకున్నంత మేర పొందలేరన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతం ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది, అధికారులను శాలువ, సర్టిఫికెట్లతో సన్మానించారు. కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ హరిసేవ్యానాయక్, డీఈఈ సుబ్రహ్మణ్యం, రామచంద్రరెడ్డి, ఏఈలు తదతరులు పాల్గొన్నారు.

ఉప్పలూరు గ్రామస్థుల దాతృత్వం



బాధితులకు ఆర్థిక సహాయం
అందజేస్తున్న గ్రామస్థులు

కాశినాయన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలూరు పీర్ల పండుగలో గాయాలపాలైన 11 మంది బాధితులకు బుధవారం గ్రామస్థులు రూ.2.15లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మొహర్రం పండుగ చివరిరో జైన గత ఆదివారం ఒకవైపు కోలాటాలు, మరోవైపు పీర్లకు ప్రత్యేక పూజలు నడుస్తున్నా యి.. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అగ్నిగుండం పూడ్చే సమయంలో ప్రమాదవశాత్తు గుడం సమీపంలో కోలా టం తిలకిస్తున్న 11 మంది భక్తులపై వేడి బూడిద, అగ్ని రవ్వలు పడి కాళ్లు, చేతులు కాలి ఆసుపత్రుల్లో చేరారు. వీరందరికి గ్రామస్థులు తమవంతు సాయంగా రూ.2.15 లక్షలు వసూలు చేసి అందజేశారు. మానవతా దృక్ప థంతో గ్రామస్థులు అందించిన సహాయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తపాలా సేవలు మరింత వేగవంతం

- కడప డివిజన్‌లో సాంకేతిక 2.0 విధానం అమలు
- తపాలాశాఖ కడప డివిజన్ సూపరింటెండెంట్ రాజేష్



మాట్లాడుతున్న రాజేష్

కడప మారుతీనగర్, జులై 16 (ఆంధ్రజ్యోతి): తపాలా సేవలు మరింత వేగ వంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి రానున్నాయని కడప డివిజన్ సూపరింటెండెంట్ జి.రాజేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తపాలా ప్రధా న కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తపా లాశాఖ ప్రజలకు మరింత నాణ్యమైన రీతిలో సేవలు అందించేందుకు అనువుగా కడప పోస్టల్ డివిజన్ పరిధిలో గల 451 తపాలా కార్యాల యా లలో ఈనెల 22వ తేదీ నుంచి సాంకేతిక 2.0 విధానం అమలు చేయను న్నట్లు వెల్లడించారు. ఈ కొత్త విధానంతో సాంకేతిక మార్పులతో తపాలా సేవల్లో వేగం, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వ హణ తక్కువ సమయంలో ట్రాకింగ్‌తో వినియోగదారులకు అందు బాటులోకి రానుందన్నారు. ఈ విధానం అమలుకు అవసరమైన సన్నాహాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 21 వరకు తపాలా కార్యా లయాల్లో సేవలను తాత్కాలికంగా నిలిపివేసి డేటా ట్రాన్స్‌ఫర్, సాంకేతిక మరమ్మతులు త్వరిత గతిన పూర్తిచేసి ఈనెల 22 నుంచి అన్ని తపాలా కార్యాలయాలలో పునఃప్రా రంభమై ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నామన్నారు. ప్రజలు తపాలా సేవలను అందిపుచ్చుకుని సహకారం అందించాలని కోరారు.

డ్రైనేజీ వ్యవస్థపై అధికారుల పర్యవేక్షణ కరువు



ప్రవహించే దారి లేక కాలువలో కదలని మురుగు నీరు

● ప్రధాన కాలువలపై దర్జాగా దుకాణాల ఏర్పాటు

రాజంపేటటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణాన్ని అతి సుందరంగా తీర్చిదిద్దుతామని రాజకీయ నేతలు ఊకదంపుడు ప్రసంగాలు చేస్తారే తప్ప చేతలు మాత్రం శూన్యం. రాజంపేట సబ్‌డివిజన్‌లో సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లాంటి ఉన్నతస్థాయి అధికారులు ఉన్నప్పటికీ పర్యవేక్షణ శూన్యం అనే విమర్శలున్నాయి. పంచాయతీ నుంచి మున్సిపాలిటీ కావడంతో పన్నులభారం పెరిగింది తప్ప నేటికీ పంచాయతీ సౌకర్యాలే ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పోస్టాఫీసు వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ప్రధాన మురుగు కాలువ ఏర్పాటు చేశారు. ఈ మురుగు కాలువ పట్టణంలో ఎస్‌బీఐ, ప్రసాద్ వైన్‌షాపు, ఉర్దూ ఉన్నత పాఠశాల వైపు ఉన్న ఆనవాళ్లు కానరావు. అలాగే డీసీసీ బ్యాంకు, గాయత్రి కాలేజీ, అన్న క్యాంటీన్, మారుతిప్రసన్న లాడ్జి వైపు నుంచి యాద్‌గార్ స్వీట్ బేకరి వైపు కాలువ ఉన్న కుంచించుకొనిపోవడంతో ఆనవాళ్లు కనిపించడంలేదు. దుకాణాల యజమానులు స్లాబులు వేసి డ్రైనేజీ కాలువను ఆక్రమించారు.

పట్టణానికి తగినట్లు డ్రైనేజీ వ్యవస్థ లేదు



పట్టణంలో ఆనాటి జనాభాకు, నేటి జనాభాకు పదంతలు పైగా పెరిగింది. కానీ ఆనాటి కాలువలే నేటికీ ఉండటంతో సమస్య తీవ్రత ఎక్కువ ఉంది. ప్రధాన రహదారే మురుగునీటి వా గులా దర్శనమిస్తోంది. ఎక్కడ ప్రధాన కాలువలున్నాయి అన్న కోణంలో విచారించి వాటిని శుభ్రపరచాలన్న ఆలోచన చేయడం లేదు.

- మనుబోలు వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్

డ్రైనేజీ పేరుతో ప్రజాధనం వృథా



ప్రతి సంవత్సరం మున్సిపాలిటీ అధికారులు వర్షాకాలంలో తమ బడ్జెట్‌లో ఎంతో కొంత ఖర్చు పెట్టామన్న కాకి లెక్కలు చూపడానికి అక్కడక్కడా పూడిక తొలగిస్తున్నారు. కానీ ము రుగు కాలువలోని నీరు ఎక్కడ అడ్డుపడుతోంది. ఆ నీరు ప్రధాన కాలువలోకి పోతుందా లేదా అన్న దోరణిలో ఆలోచించడం లేదు. కావున ముందు కాలువలను శుభ్రపరచండి.

- ఇడిమడకల కుమార్, టీడీపీ నాయకుడు



వైన్‌షాపు వద్ద ఆక్రమణకు గురైన ప్రధాన కాలువ

సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



బుడుగుంటపల్లిలో నిర్వహించిన సుపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న ముక్కా

రైల్వేకోడూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కుడా చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని బుడుగుంటపల్లి, సమతనగర్ గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ ఏడాది చేసిన సంక్షేమ పథకాలను వివరించామని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నామన్నారు. ప్రజలకు ఏలోటు రాకుండా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిత్యం ప్రజా సంక్షేమం కోసమే తపన పడుతున్నారని తెలిపారు. గిరిజనులు, దళితులు, వెనకబడిన తరగతుల ప్రజలతో ఈ కార్యక్రమం ద్వారా మాట్లాడినప్పుడు అనేక సమస్యలు భయటపడ్డాయని వాటిని పరిష్కారం చేసేందుకు కృషి చేస్తామన్నారు. తొలిఅడుగు కార్యక్రమం లో ప్రజా సమస్యలన్నింటిని నమోదు చేసి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకునిపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు మాజీ సర్పంచ్ మురళిధర్ గౌడ్, సీనియర్ మైనార్టీ టీడీపీ నాయకుడు పఠాన్ మౌలా, పోకల మణి, తల్లెం వెంకటరమణారెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, గడికోట సుబ్బరాయుడు, తిరుపతి శేఖర్, సిద్ధేశ్వర, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తాళ్లపాక నుంచి తిరుపతికి ఆర్టీసీ బస్సు సర్వీసు



ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం సమర్పిస్తున్న కేఎంఎల్ నరసింహ

రాజంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి):అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక నుంచి తిరుపతికి త్వరలో ఆర్టీసీ బస్సు నడపనున్నట్లు నేషనల్ బీసీ ఫ్రంట్ కన్వీనర్ కేఎంఎల్ నరసింహ తెలిపారు. బుధవారం ఆర్టీసీ డీఎం రమణయ్యతో ఈ విషయమై చర్చించారు. భక్తులకు, పర్యాటకులకు తాళ్లపాక నుంచి తిరుపతికి బస్సు సౌకర్యం కల్పిస్తే అన్నివిధాల న్యాయం జరుగుతుందని డీఎంకు వివరించగా ఆయన సానులకూంగా స్పందించినట్లు తెలిపారు. ఈ చర్చల్లో అసిస్టెంట్ మేనేజర్ మాధవిలత, కేఆర్ఎన్ రెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.

గిరీష్‌రెడ్డి దాతృత్వం అభినందనీయం



గిరీష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి

పెనగలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తలమంచి చారిటబుల్ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు, దాతృత్వాలు చేస్తున్న హైదరాబాదులో స్థిరపడిన పి.కొత్తపల్లె నివాసి తలమంచి గిరీష్‌రెడ్డి దాతృ త్వం అభినందనీయమని పెనగలూరు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి అన్నారు. తలమంచి చారిటబుల్ ట్రస్టు ద్వారా రూ.10 లక్షలతో పెనగలూరు పోలీసుస్టేషన్‌ను ఆధునీకరించామన్నారు. బుధవారం దాత గిరీష్‌రెడ్డితో పాటు కొత్తపల్లె యూత్ సభ్యులకు ఎస్ఐ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పి.కొత్తపల్లె గ్రామ పెద్దలు ఆకుల చిన్న, మీగడ విశ్వనాథ్‌రెడ్డి, నరేంద్ర, జి.పెంచలయ్య, శివారెడ్డి, మస్తాన్, మహబూబ్‌బాషా, అబ్బిరెడ్డి, రహమాన్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి

పెనగలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పక్కా గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో విజయరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్, ఏవో మోహన్ సూచించారు. బుధవారం కంబాలకుంట, పెనగలూరు జగనన్న కాలనీ, లేఅవుట్‌లను వారు తనిఖీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు పూర్తి చేసుకోకపోతే ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు సాయం నిలిచిపోతుందన్నారు.

బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

రాజంపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని కొండ్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సేవలందించిన సోమశేఖర్, సుబ్బారెడ్డి, చాంద్‌బాషాలు బదిలీపై వేరే పాఠశాలకు వెళుతుండడంతో బుధవారం వారికి ఊటుకూరు ఎంపీటీసీ నాగచంద్రశేఖర్‌రెడ్డి, రఘునాథ్, వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగచంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల పాటు కొండ్లోపల్లె విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పి గ్రామ ప్రజలకు ఆత్మీయులుగా నిలిచారని తెలిపారు. ఉపాధ్యాయులు సోమశేఖర్, సుబ్బారెడ్డి, చాంద్‌బాషాలను విద్యార్థులు, గ్రామ ప్రజలు ఎన్నటికీ మరువలేరన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.నరసింహులు, అంగన్వాడీ కార్యకర్త, స్వర్ణలత, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో వేర్వేరు పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు బుధవారం సాయంత్రం వీడ్కోలు పలికారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వారిని సత్కరించారు. బదిలీపై వెళ్లిన ఖాదర్‌బాషా, శిల్పి ఆనందాచారి, బి.రవిశంకర్‌రెడ్డి, తులసి, స్వర్ణలత, రమణమ్మ, ప్రమీల, రాహేల్, ఆఫీస్ సబార్డినేట్ ఇర్ఫాన్‌లకు వీడ్కోలు పలికారు. అనంతరం వీరి స్థానంలో పాఠశాలకు విచ్చేసిన ఉపాధ్యాయులు గ్లోరీ కిరణ్ ఉజ్వల, రాజేంద్ర, గాయత్రిదేవి, డాక్టర్ శర్వాణి, సుమలత, ఆఫీసు సబార్డునేట్ నాగలక్ష్మిలను శాలువా కప్పి పూలు పండ్లు ఇచ్చి స్వాగతం పలికారు.

'వాతావరణ బీమా గడువు పొడిగించాలి'

రాయచోటిటౌన్, జూలై16(ఆంధ్రజ్యోతి): పంటలు సాగుపై చేసే వాతావరణ బీమా గడువును ఆగస్టు 15 వరకు పొడిగించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జిల్లా వ్యవసాయశాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న క్రాప్ రుణాలను సైతం రెన్యువల్ చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నారని, రుణాలు పెండింగ్‌లో ఉంటే వాతావరణ బీమా జూలై 15కు అయిపోయిందని ప్రభుత్వాలు తెలియజేయడం బాధాకరమన్నారు. పంట దిగుబడులు లేక, మామిడి పంట పూర్తిగా నష్టపోయిన రైతన్నలు పంట రుణాలను రెన్యువల్ చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు వాతావరణ బీమా అయిపోయిందని చెప్పడం సరికాదన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

సుండుపల్లె, జూలై16(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని స్పెషల్ ఆఫీసర్ సురేశ్‌కుమార్, మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థినుల కోసం మెరుగైన వసతులు కల్పిస్తోందన్నారు. కష్టపడి చదివి పది, ఇంటర్మీడియట్‌లో మంచి మార్కులు సాధించి మంచిపేరు తీసుకురావాలన్నారు.

మానవత సంస్థకు రూ.10 వేలు ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న యువరాజు

సుండుపల్లె, జూలై16(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసినట్లు ఆ సంస్థ చైర్మెన్ మిన్నమ గంగిరెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రానికి సమీపంలోని ఏటిగడ్డరాచపల్లికి చెందిన యువరాజు ఆయన తండ్రి కృష్ణంరాజు జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. దీన్ని పేదలకు మంచి చేసేందుకు వినియోగిస్తామని గంగిరెడ్డి తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

రైల్వేకోడూరు, జూలై16(ఆంధ్రజ్యోతి): పుల్లంపేట మండలం రెడ్డిపల్లి చెరువు కట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయకపోవడంపై ఈనెల 21న చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గిరిజనులు, యానాదుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షత చూపుతోందన్నారు. బుధవారం మండలంలోని శెట్టిగుంట గ్రామంలో మృతి చెందిన కుటుంబాలను ఏపీఎండీసీ జేఏసీ పోరాట కన్వీనర్ ఆర్. వెంకటేష్‌తో కలిసి పరామర్శించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జనార్ధన్ రెడ్డి క్షతగాత్రులను పరామర్శించినా ఇంతవరకు ఎందుకు నష్టపరిహారం ప్రకటించలేదని ఆయన ప్రశ్నించారు.





మండల ఉపాధ్యక్షుడిగా శ్రీధర్ ఏకగ్రీవం



కేతంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎన్నికల అధికారులు

సంబేపల్లె, జూలై16(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండల ఉపాధ్యక్షుడిగా కేతంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల పరిశీలకుడు లక్ష్మీప్రసాద్, ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో భారీ బందోబస్తు నడుమ సంబేపల్లె మండల ఉపాధ్యక్ష ఎన్నిక జరిగింది. గున్నికుంట్ల ఎంపీటీసీ కేతంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఎన్నికలకు నారాయణరెడ్డిపల్లె ఎంపీటీసీ దేరంగుల రమాదేవి, రౌతుకుంట ఎంపీటీసీ ఉడేం చిన్న భద్రయ్య, నాగిరెడ్డిగారిపల్లె ఎంపీటీసీ గుండ్లూరు రమాదేవి, శెట్టిపల్లె ఎంపీటీసీ మూడే సీతమ్మ, గున్నికుంట్ల ఎంపీటీ కేతంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, దుద్యాల ఎంపీటీసీ మీసాల భగ్యమ్మ హాజరుకాగా దేవపట్ల ఎంపీటీసీ ఆవుల నాగశ్రీలక్ష్మి, ప్రకాశ్‌నగర్ కాలనీ ఎంపీటీసీ కేతంరెడ్డి వరలక్ష్మి, సోమవరం ఎంపీటీసీ పొత్తూరి రవీంద్రనాయుడు, సదిపిరాళ్ల ఎంపీటీసీ గోర్ల హరిత, అడవికమ్మపల్లి ఎంపీటీసీ యాట రామరాజు గైర్హాజరయ్యారు. 11 మందిలో ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు హాజరయ్యారు. కోరం ఉండటంతో నాగిరెడ్డిగదరిపల్లె ఎంపీటీసీ గుండ్లూరి రమాదేవి ప్రతిపాదన మేరకు గున్నికుంట్ల ఎంపీటీసీ శ్రీధర్‌రెడ్డి పోటీలో నిలిచారు. దుద్యాల ఎంపీటీసీ మీసాల భాగ్యమ్మ, నారాయణరెడ్డిపల్లె ఎంపీటీసీ దేరంగుల రాజకుమరి బలపరిచారు. మరొకరు పోటీ చేసేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో శ్రీధర్‌రెడ్డిని వైస్ ఎంపీపీగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి

సంబేపల్లె, జూలై16(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులను కల్పిస్తామని, విద్యార్థులు చక్కగా చదువుకోవాలని తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు. బుధవారం దేవపట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని తెలియజేశారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం అక్కడే చేశారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చక్కటి విద్యను అందించాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదివి గొప్ప వ్యక్తులుగా ఎదగాలని తెలియజేశారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. వెనుకబడిన ప్రతి సబ్జెక్టుగలను మెలుకువలు నేర్పించి మంచి మార్కులు వచ్చేలా చూడాలన్నారు. విద్యార్థుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషిచేస్తానని తెలియజేశారు.

గంగమ్మ జాతరకు పటిష్టమైన బందోబస్తు



గంగమ్మ గుడి వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ, పోలీసులు

సిద్దవటం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాధవరం-1 పార్వతిపురం గ్రామంలో వెలసిన శీతల గంగమ్మ అమ్మవారి జాతర మహోత్సవం కారణంగా భక్తులు అదిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ శీతల గంగమ్మ జాతర బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో గురువారం అమ్మవారి గ్రామోత్సవం సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు సూచనల మేరకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని గ్రామోత్సవంలో గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎవరైనా మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ రఫీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా రేషన్ సరఫరా చేయించాలి

ఓబులవారిపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మంగంపేట గ్రామ పంచాయతీలోని కాపుపల్లె, హరిజనవాడ, అరుందతివాడ ప్రజలకు అనుకూలమైన ప్రదేశంలో రేషన్ సరఫరా చేయించాలని టీడీపీ రాజంపేట పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు గునిపాటి చెన్నరాయుడు బుధవారం సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవికి విన్నవించారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు అందించడం వల్ల ఇబ్బంది లేదన్నారు. మైనింగ్ ప్రాంతం కావంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సబ్‌కలెక్టర్ స్పందిస్తూ వారం లోపు అనుకూలమైన ప్రాంతంలో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

నకిలీ అధికారులను నమ్మొద్దు : కమిషనర్

రాజంపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణ పరిధిలో ఇటీవల కొంత మంది నకిలీ ఐడీ కార్డులు ధరించి మున్సిపల్ సిబ్బంది అంటూ షాపుల వద్దకు వచ్చి ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని, అలాంటివారిని నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు సూచించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లైసెన్సు ఫీజులు చెల్లించవలసినప్పుడు నేరుగా సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ విధానం ద్వారా, మున్సిపల్ ఆఫీసు బిల్లు కౌంటర్‌లో మాత్రమే చెల్లించాలన్నారు. నకిలీ అధికారులను గుర్తించి వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. అలా నకిలీలను గుర్తిస్తే వారికి కౌన్సెలింగ్ కూడా ఇవ్వాలని ఆదేశించారు.

బీమా సౌకర్యం అవసరం

గాలివీడు, జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరికీ ఏదో ఒక విధంగా బీమా సౌకర్యం ఉండాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమేశ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం నీసీపల్లి పంచాతీయతీలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో భాగంగా పీఎంఎస్ బీవై, పీయంజేజే, బీవై, ఏపీవై వంటి పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫీసర్లు రాజా, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో



హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

రామాపురం, జూలై16(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠ్రావుపేట ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఎంపీడీవో జాషువా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లోని స్టాక్‌ను, వంటశాలను డార్మెట్ రూములు, బాత్‌రూంలు, బాలికల హాజరు రికార్డులు, మెనూ చార్టులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

రాయచోటిటౌన్, జూలై16(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అమానత్ సేవా ససైటీ అధ్యక్షుడు అతావుల్లా అన్నారు. బుధవారం అత్యవసర పరిస్థితుల్లో హీబా బ్లడ్ డోనర్స్ ఆర్గనైజేషన్, అమానత్ సేవా సొసైటీల ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని కలకడకు చెందిన గర్భిణికి ఓ నెగిటివ్ గ్రూప్ రక్తదానం చేశారు. అలాగే మరికొందరు రోగులకు అతావుల్లా ఆధ్వర్యంలో రక్తదానం చేయించారు.

ఘనంగా దర్గా స్వామి జయంతి



రామాపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): సద్గురు దర్గా స్వామి 95వ జయంతిని మండలంలోని నీలకంట్రావుపేట సమీపంలోని సాయినగర్ సాయి విద్యా మందిర్ ఆశ్రమంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు హాజరై సద్గురువుకు పూజలు చేశారు.

ఓటు నమోదును పక్కాగా చేపట్టాలి

రైల్వేకోడూరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఓటు నమోదును పక్కాగా చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల ఏఎల్ఎంటి, ఓబులవారిపల్లె తహసీల్దార్ యామిని తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు రెవెన్యూ కార్యాలయం సభాభవనంలో కోడూరు మండలంలోని బూత్‌లెవల్ ఆఫీసర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు ముజీబ్, ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి మధుసూదన, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ గల్లా వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

'ముగ్గురాయి లోడింగ్ పనుల్లో అందరికీ అవకాశం'

ఓబులవారిపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మంగంపేట ముగ్గురాయి లోడింగ్ పనుల్లో అందరికి అవకాశం కల్పిస్తుందని టీడీపీ సీనియర్ నాయకులు కొటారు సుబ్రమణ్యం బుధ వారం విలేకరులతో పేర్కొన్నారు. చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. మంగంపేట గ్రామంలోని నిర్వాసితులు అందరి మిషన్లకు పని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ విషయమై బహిరంగ చర్చకు సిద్దమా అని సవాల్ విసిరారు.

ఆవులకు వ్యాధి నిరోధక టీకాలు

నందలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఈదరపల్లెలో బుధవారం ఆవులకు లంపిస్కిన్(ముద్ద చర్మవ్యాధి) నిరోధక టీకాలు వేసినట్లు డాక్టర్ మాధవీలత పేర్కొన్నారు. టీకాలు వేయడం వల్ల ఆవులు వ్యాధిబారిన పడకుండా ఉంటాయన్నారు. వీఏ సుదర్శన్‌రెడ్డి, ఏహెచ్‌ఏలు జాహ్నవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ ఎప్పటికో..

- పీలేరులో చిరుజల్లులకే రోడ్లపైకి మురుగు
- ధ్వంసమైన మురుగు కాలువలు
- దుర్వాసన, దోమలతో జనం సతమతం
- దుర్గంధం నడుమ ఆర్టీసీ బస్‌స్టేషన్

పీలేరు పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండగా.. అందుకనుగుణంగా వసతులు సంతరించుకోవడంలో వెనుకబడి ఉంది. ఎన్నికల సందర్భంగా నాయకులు గుప్పించే హామీలు కార్యరూపం దాల్చకపోవడంతో జనం సమస్యలతో సహజీవనం చేయాల్సి వస్తోంది. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు కృషి చేస్తామని ఎన్నికల సందర్భంగా రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, 2017లో అప్పటి పంచాయతీ రాజ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోలేదు. దీంతో పలు వీధులు దుర్గంధ భూయిష్టంగా మారాయి. ఏళ్లు గడచి పోతున్నాయి తప్ప భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు వైపు ఒక్క అడుగు కూడా పడడం లేదు.


ఆర్టీసీ బస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపై మురుగు ప్రవాహం

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో 60 వేలకు పైగా జనాభా ఉండగా, 150కి పైగా వీధులున్నాయి. శరవేగంగా పట్టణం విస్తరిస్తోంది. అందుకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడంతో దోమల బెడద అధికమై జనం రోగాలు బారిన పడుతున్నారు. అవసరం మేరకు. పట్టణంలో మురుగు కాలువలు నిర్మించక పోగా, ఉన్న వాటిలో క్రమబద్ధత లేకపోవడంతో రోజురోజుకూ సమస్య జటిలంగా మారుతోంది. నాలుగు చినుకులు పడితే మురుగు రోడ్లపై పరుగులు పెడుతోంది. ఆర్టీసీ బస్ స్టేషన్, ఎస్వీ మహల్, సుధాసుధీర్ వీధి, ఇందిరానగర్, వారపు సంత మార్గం, బండ్లవంక, మేకనోనికాలువ రోడ్, కట్టుకాలువ వీధి, రాజీవ్‌నగర్, సాయిరాం వీధి తదితర ప్రాంతాలలో మురుగునీరు రోడ్లపైకి రావడం పరిపాటిగా మారింది. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పీలేరు ఆర్టీసీ బస్‌స్టేషన్ సముదాయం దుర్గంధానికి నిలయంగా మారింది.

పట్టణంలో అక్రమకట్టడాలు అధికం కావడంతో పలు ప్రాంతాల్లో మురుగుకాలువలు మూసుకుపోయి సమస్య మరింత జటిలంగా తయారైంది. కొన్ని ప్రాంతాలలో మురుగు కాలువలను పూడ్చివేశారు కూడా. దీంతో మురుగు ముందుకు పోయే మార్గం లేకుండా పోయింది. మరికొన్ని చోట్ల మురుగు కాలువలు నిర్మించకుండా సీసీ రోడ్లు మాత్రమే వేసి చేతులు దులుపుకోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.


సంప్ నుంచి రోడ్డు పైకి వస్తున్న మురుగు

అండర్ డ్రైనేజీతోనే సమస్య పరిష్కారం



వర్షం వస్తే పట్టణంలోని పలు చోట్ల మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో పాదచారులు, వ్యాపారులు, విద్యార్థులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు పార్టీలకు అతీతంగా అందరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలి.

- అర్. శ్రీనివాసులు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు

ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి..



పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుండడంతో అండర్ డ్రైనేజీ ఏర్పాటు అవసరం ఎంతైనా ఉంది. ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. పూర్తి స్థాయి నివేదిక రావడానికి మరికొంత సమయం పడుతుంది.

- లతీఫ్‌ఖాన్, డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జి ఈవో

ఇరుకైన రోడ్లు.. ఆపై ఆక్రమణలు..

ఇళ్ల ముందున్న రోడ్డును ఆక్రమించి సంపులు, మెట్లు నిర్మించుకోవడంతోపాటు, మొక్కలు నాటుకోవడంతో వీధులన్నీ ఇరుకుగా మారాయి. దీంతో వాహన చోదకులు, ఆటోవాలాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణం మధ్యలో నుంచి వెళుతున్న అయ్యప్పనాయుని చెరువు సప్లై చానల్‌కు మురుగు నీరు మళ్లించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్గంధంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.


అధ్వానంగా మురుగుకాలువ

పీజీఆర్ఎస్‌లో ఫార్మసీ విద్యార్థుల ఫిర్యాదుపై

సోషల్ వెల్ఫేర్ డీడీ విచారణ


కళాశాల డైరెక్టర్లను విచారణ చేస్తున్న సాంఘిక సంక్షేమశాఖ డీడీ కృష్ణ

మదనపల్లె టౌన్, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): కళాశాల యాజమాన్యంలోని వర్గాల మధ్య విభేదాల కారణంగా తమ సర్టిఫికెట్లకు భద్రత లేకుండా పోయిందంటూ కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో, బుధవారం సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఎస్.కృష్ణ కళాశాలలో ఓ వర్గానికి చెందిన సొసైటీ సెక్రటరీ, ప్రిన్సిపాల్ శశివర్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు బి.శ్యామలమ్మ, గోవర్ధన్‌రెడ్డి, ఎర్రంరెడ్డి, విష్ణు వర్ధన్‌రెడ్డి, అమరావతి, అధ్యాపకులను, విద్యార్థులను విడివిడిగా విచారణ చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్లు మాటాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి రెండు కంతులు విడుదల చేసినా తమ కళాశాల విద్యార్థులకు జమ కాలేదన్నారు.

మరో వర్గానికి చెందిన డైరెక్టర్లు అడ్డుపడటంతోనే ఈ సమస్య వస్తోందన్నారు. దీంతో అధ్యాపకులకు వేతనాలు చెల్లించడం కష్టంగా ఉందని వాపోయారు. విద్యార్థులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల ఆలస్యం కావడంతో ఫీజులు చెల్లించేందుకు తాము అప్పులు చేయాల్సివస్తోందన్నారు. డీడీ కృష్ణ మాట్లాడుతూ విచారణ నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామని, ఎలాంటి పరిస్థితుల్లోనూ విద్యార్థులు నష్టపోకూడదని యజమాన్యానికి సూచించారు. ఈ విద్యా సంవత్సరం సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూవో గంగిరెడ్డి, వార్డెన్ రాంప్రసాద్, డీఎస్‌డబ్ల్యూవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏక పక్షంగా విచారణ తగదు

సాంఘిక సంక్షేమశాఖ డీడీ ఏకపక్షంగా వ్యవహరించడం తగదని ఆ కళాశాల కరెస్పాండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కృష్ణచైతన్య ఫార్మసీ కళాశాల గేటు వద్ద రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లికార్జునరెడ్డి, శశికుమార్‌రెడ్డి, గోపాల్‌రెడ్డితో కలసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త సొసైటీని ఏర్పాటు చేసుకుని కళాశాల నిర్వహించామన్నారు. ఈ విషయమై హైకోర్టులో వివాదం నడవగా తమకు అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. రెండు నెలల క్రితం తమ ప్రత్యర్థి వర్గం కళాశాలను దౌర్జన్యంగా ఆక్రమించుకుందన్నారు. ఈ విషయాలన్నీ తాము డీడీ దృష్టికి తీసుకెళ్లేందుకు వస్తే కళాశాల గేట్లు మూసివేసి దౌర్జన్యం చేస్తున్నారన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నా సాంఘిక సంక్షేమ డీడీ కృష్ణ విచారణకు రావడం హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించడమే అన్నారు.

డీడీ ఒక వర్గాన్ని మాత్రమే విచారణ చేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఫార్మసీ కళాశాల విద్యార్థులకు ఏ విధంగా నష్టం కలిగించినా తాము ఊరుకోమని హెచ్చరించారు.

కల్తీ ఎరువుల స్వాధీనం


పురుగు మందులను స్వాధీనం చేసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

కలికిరి, జూలై 16 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలో రెండు దుకాణాల్లో భారీగా కల్తీ రసాయనిక ఎరువులు పట్టుబడ్డాయి. విజిలెన్స్ వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం కలికిరిలోని రెండు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అలీ ట్రేడర్స్‌లో 12 టన్నుల కల్తీ ఎరువులు పట్టుబడగా వాటి విలువ రూ.2.31 లక్షలుగా నిర్ధారించారు. సిరి అగ్రో మార్ట్‌లో దాదాపు రూ.80 వేలు విలువచేసే టన్ను ఎరువులు పట్టుబడ్డాయి. ఈ రెండు దుకాణాల్లో గుర్తించిన ఎరువులను విక్రయించకుండా చర్యలు తీసుకున్నారు. అక్కడికి సమీపంలోని క్రాంతి ట్రాన్స్‌పోర్టులో దాదాపు ఆరు నెలల నుంచి నిల్వ ఉంచిన రూ.92 వేలు విలువ చేసే ఎరువులు, పురుగు మందులను స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఉదయం పీలేరులో విజిలెన్స్ తనిఖీలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ముందు జాగ్రత్తగా మూసేశారు. దీంతో అధికారులు కేవలం రెండు దుకాణాల్లో మాత్రమే తనిఖీలు చేయ గలిగారు. ఈ దాడుల్లో తిరుపతి విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, కల్యాణదుర్గం వ్యవసాయ శాఖ ఏడీ ఏఎన్.యల్లప్ప, స్థానిక వ్యవసాయాధికారులు ఎం.హేమలత, పవన్ కుమార్, వీఆర్వో ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి ఆదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు


రాజశేఖర్

పెద్దతిప్పసముద్రం జూలై (ఆంధ్రజ్యోతి) : తమ కుమారుడు అదృశ్య మయ్యాడని రాపూరివాండ్లపల్లె గ్రామపంచాయతీ కాయలవాండ్లపల్లెకు చెందిన కృష్ణమ్మ పీటీఎం పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ నెల 9వ తేదీన వేంకటేశ్వర స్వామి దర్శనానికని తిరుమలకు వెళ్లిన తన కుమారుడు రాజశేఖర్ తిరిగి రాలేదని, మొలకలచెరువుకు వెళ్లి అక్కడి నుండి రైలులో తిరుమలకు వెళతానని చెప్పి వెళ్లాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. వివిధ ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని, తమ కుమారుని గుర్తించి తమకు అప్పగించాలని ఆమె ఫిర్యాదులో విన్నవించారు.

ద్విచక్ర వాహనాలు చోరీ

పీలేరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి మూడు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. స్థానిక చెన్నారెడ్డి వీధిలో కాపురముంటున్న వెంకటేష్ ఇంటి ముందు పార్క్ చేసిన బుల్లెట్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మల్లెలవీధిలో కాపురం ఉంటున్న నజీర్ ఇంటి ముందు పార్క్ చేసిన స్కూటీని, తిరుపతి మార్గంలో మరో బుల్లెట్ చోరీకి గురైంది. దీంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది

చికిత్స పొందుతూ మహిళ మృతి

రామసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీలోని బలిజపల్లె క్రాస్ వద్ద గత నెల 21న గుర్తుతెలియని వాహనం ఢీకొని దిగువపల్లెకు చెందిన ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే సంఘటనలో తీవ్రంగా గాయపడిన కృష్ణమ్మ అనే మహిళ మదనపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు పోలీసులుతెలిపారు.

డ్రిప్ పైపులు చోరీ..

పెద్దతిప్పసముద్రం జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తన పొలంలోని డ్రిఫ్ పైపులు చోరీకి గురయ్యాయని స్థానిక బెస్తవీధికి చెందిన బెస్తగవ్వల మంజునాథ్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్థానిక రంగసముద్రం రోడ్డులోని తమ పొలంలో అమర్చిన డ్రిప్ పైపులను ఈ నెల 13వ తేదీ రాత్రి వేళల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా మంజునాథ్ మాట్లాడుతూ తాను అప్పులు చేసి ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పైపులను చోరీ చేశారని, గతంలో కూడా రెండు సార్లు ఇలాగే జరగడంతో తీవ్రంగా నష్టపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని స్థానిక పోలీసులను కోరాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మదనపల్లె అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఐషర్ వాహనం ఢీకొని ద్విచక్రవాహన దారుడు గాయపడ్డాడు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివారాల మేరకు బుధవారం సాయంత్రం పీలేరు నుంచి బెంగళూరు వెళుతున్న ఐషర్ వాహనం తురకపల్లె సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ సంఘటనలో బైక్‌పై వెళుతున్న షేక్ సయ్యద్ సాహెబ్ కాలు విరిగింది. స్థానికులు అతనిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి కుమారుడు ఖాదర్‌బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'దేశం కోసం మధ్యవర్తిత్వం'పై అవగాహన ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న జడ్జి గురు అరవింద్

వాల్మీకిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): దేశం కోసం మధ్యవర్తిత్వం అన్న అంశంపై వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు, పోలీసులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక జూనియర్ సివిల్ జడ్జి గురు అరవింద్ మాట్లాడుతూ ప్రధానంగా వ్యాజ్యానికి ప్రత్యామ్నాయంగా మధ్యవర్తిత్వాన్ని ఎంచుకుని కక్షిదారులతో చర్చించి, కేసులకు పరిష్కార మార్గం చూపాలన్నదే సుప్రీం కోర్టు భావన అని తెలిపారు. న్యాయస్థాన పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివాదాలు, ప్రమాద క్లైంలు, చెక్‌బౌన్స్ కేసులు, గృహ హింస, క్రిమినల్ కేసులు, సర్వీసు విషయాలు, తదితర కేసుల విషయంలో కక్షి దారులకు అవగాహన కల్పిస్తూ వీలైనంత త్వరగా కేసులను పరిష్కరించుకునేలా చూడాలన్నారు. అనంతరం స్థానిక ఉర్దూ హైస్కూల్ వద్ద నుంచి న్యాయవాదులు, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, సెక్రటరీ రమణ, న్యాయవాదులు, ద్వారకనాథరెడ్డి, వెంకటేశ్వర ప్రసాద్, జుడిషియల్ సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ' కార్యక్రమం పరిశీలన


కురిజల గ్రామస్తులతో కేంద్ర బృందం


రామసముద్రం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురిజల గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమాన్ని బుధవారం కేంద్రం బృంద సభ్యుడు హేమంత్ పరిశీలించారు. గ్రామాలలో పారిశుధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి చెత్త పొడి చెత్త సక్రమ నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ సందర్శించి కంపోస్ట్ తయారీ, మరుగుదొడ్ల వినియోగంపై గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, సామూహిక మరుగుదొడ్ల వినియోగం, పారిశుధ్య నిర్వహణపై సర్వే నిర్వహించి ఆయా గ్రామ పంచాయతీలకు ర్యాంకులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.మంగమ్మ, ఎంపీడీవో గఫూర్, మదనపల్లి నియోజకవర్గ రిసోర్స్ పర్సన్ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి రెడ్డి నరసింహులు, ఇంజనీరింగ్ సహాయకులు శ్రావణి, వెల్ఫేర్ సహాయకులు సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్ రత్నమ్మ, సంఘమిత్ర భూలక్ష్మి, ఏఎన్ఎం రుక్మిణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు, జరిమానా..


ముద్దాయిలతో సిద్ధవటం పోలీసులు

సిద్ధవటం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగిపై హత్యాయత్నం చేయడంతోపాటు, ప్రభుత్వ ఆస్తికి నష్టం కలిగించిన కేసులో రాజోలి మల్లికార్జున, రాజోలి రత్నమ్మకు రెండేళ్ల ఆరు నెలలు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధిస్తూ బుధవారం బద్వేల్ సీనియర్ సివిల్‌జడ్జి వైజే పద్మశ్రీ తీర్పునిచ్చారని సిద్ధవటం ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. 2018 డిసెంబరు 29న రాజోలి మల్లికార్జున, అతని తల్లి రత్నమ్మ జూనియర్ అసిస్టెంట్ గుమ్మళ్ల రామకృష్ణారెడ్డిపై గట్టిగా కేకలు వేసి కోర్టు మర్యాదకు భంగం కలిగించడంతోపాటు, అడ్డువచ్చిన కోర్టు కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని పిడిగుద్దులు గుద్ది దాడిచేయడంతో అతను కింద పడిపోయాడరన్నారు. కుర్చీతో కానిస్టేబుల్ తలపై దాడికి యత్నించాడన్నారు. అప్పటి సిద్ధవటం ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేశారన్నారు. ఈ కేసులో ఫిర్యాదుదారుని తరఫున అదనపు పీపీ శ్రీనివాసులు వాదనలు వినిపించారన్నారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సకాలంలో ప్రవేశపెట్టి నేరం రుజువు చేసి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ అభినందించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డ్రైవర్ల ఘర్షణ : 'తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్' ధ్వంసం


గాయపడిన డ్రైవర్, ధ్వంసమైన వాహనం

మదనపల్లె అర్బన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల ఘర్షణతో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం ధ్వంసమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బురకాయల కోటకు చెందిన రమణయ్య కుమారుడు శ్రీనివాసులు(37) మదనపల్లెలో తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం వాహనాన్ని ఆస్పత్రిలో పార్కింగ్ చేసే సమయంలో పృథ్వీరాజ్ అనే డ్రైవర్ మద్యం మత్తులో శ్రీనివాసులుతో గొడవ పెట్టుకుని, రాయితో దాడిచేసి గాయపరిచాడు. నిలిపి ఉన్న తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్ వాహనం అద్దాలను పగలకొట్టి చంపుతాయని బెదిరించాడు. ఈ గొడవలో ఇద్దరికీ గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను మదనపల్లె ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అ మేరకు రెండో పట్టణ పోలీసులు విచారణ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామచంద్ర తెలిపారు.

నిలిపి ఉంచిన కారు దగ్ధం


మంటల్లో దగ్ధమవుతున్న కారు

మదనపల్లె అర్బన్, జూలై 16: మండలంలోని వేంపల్లె గ్రామం సమీపంలోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వద్ద నిలిపి ఉంచిన కారు బుధవారం రాత్రి దగ్ధమైంది. ఈ ఘటన జరిగిన సమయంలో కారులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు, కాగా, కారు వద్ద ఎవరూ లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మదనపల్లె అగ్నిమాపక అధికారి శివప్ప తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి కారణాలను, ఇతర వివరాలను సేకరించారు. మదనపల్లె పట్టణం, రెడ్డీస్‌కాలనీకి చెందిన రామాంజులరెడ్డి కారులో తన తమ్ముడిని కర్ణాటక రాష్ట్రం, చింతామణిలో దింపి తిరిగి వస్తుండగా ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రి సమీపంలోకి రాగానే హఠాత్తుగా కారులోంచి మంటలు అంటుకోవడంతో కారు డ్రైవర్ పీరాతో కలసి కారు నుంచి దిగిపోయారని, ప్రమాదవశాత్తూ ఈ సంఘటన జరిగినట్లు శివప్ప తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

పెద్దమండ్యం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ నెల 6న పెద్దమండ్యం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) తల్లి మదనపల్లికి వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయం గాలివీడుకు చెందిన రామకృష్ణ(19) గమనించాడు. వెంటనే ఇంట్లోకి వెళ్లి గడియ వేసి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆదే సమయంలో బాలికకు వరసకు పెద్దనాన్న అయిన వ్యక్తి ఇంటి తలుపులు కొట్టడంతో రామకృష్ణ కిటికీ లోనుంచి నుంచి దూకి పారి పోయాడు. జరిగిన సంఘటనను బాలిక పెదనాన్నకు చెప్పింది. తరవాత మదనపల్లి నుంచి ఇంటి కొచ్చిన తల్లికి కూడా వివరించింది. ఈ నెల 15వ తేదీన బాలిక తల్లి పెద్దమండ్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు రామకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పీలేరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): పీలేరులో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్పీడీసీఎల్ పీలేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు-తిరుపతి రోడ్డులోని తన కార్యాలయంలో గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ అదాలత్ ఉంటుందని ఆయన తెలిపారు. విద్యుత్ అదాలత్ చైర్మన్‌గా విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయ మూర్తి, సభ్యులుగా మధుకుమార్, విజయలక్ష్మి వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు. పీలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ఏవైనా అపరిష్కృత విద్యుత్ సమస్యలు ఉంటే విద్యుత్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని ఆయన ప్రజలకు తెలియజేశారు.


బిట్స్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్స్



బండపల్లి సమీపంలోని బిట్స్ కళాశాల (ఇన్‌సర్ట్) కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్

రామాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సుకు అత్యధిక డిమాండ్ ఉందని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ తెలిపారు. ఈ కోర్సుకు సంబంధించి తమ కళాశాలకు 60 సీట్లు కేటాయించగా, మేనేజ్‌మెట్‌కోటాలో మరో 60 సీట్లకు అడ్మిషన్ ఇస్తున్నామని కళాశాల విజయవాడ, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ, బెంగుళూరు తదితర పట్టణాల్లో ఏ ఏ కోర్సులు ఉన్నాయో ప్రస్తుతం రాయచోటి సమీపంలోని బిట్స్ కళాశాలలో ఆ కోర్సులన్నీ ఉన్నాయన్నారు. తమ కళాశాలలో ఫీజులు మధ్య తరగతి విద్యార్థులకు అనుకూలంగా ఉంటాయన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ కోర్సులు ఉండగా ఏఐకి భారీ డిమాండ్ ఉందన్నారు.

సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో విజయకేతనం


ఇంజనీరింగ్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన బిట్స్ కళాశాల విద్యార్థులు


ఇంజనీరింగ్ మొదటి, రెండవ సెమిస్టర్ పరీక్షల్లో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ఆయన తెలిపారు. కంప్యూటర్ అండ్ సైన్స్ విభాగంలో సుమారు 88 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, 86.6 శాతం మార్కులు సాధించి సాజిదా మొదటి ర్యాంకు , 80.5 శాతంతో సానతాబసుమ్ రెండవ ర్యాంకు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సాయిదర్శిని 80.5 శాతంతో మొదటి ర్యాంకు, జాహ్నవి 79 శాతంతో రెండవ ర్యాంకు, వెంకటేశ్ 78.5 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో అగ్రగామిగా నిలిచారని తెలియజేశారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, కంప్యూటర్‌సైన్స్ హెచ్‌వోడీ ప్రొఫెసర్ టీ. వెంకటరత్నం, ఏఐహెచ్‌వోడీ ప్రొఫెసర్ సమీయా సుల్తానాలు అభినందించారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి


ప్రజా దర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సకాలంలో నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం తన క్యాంప్ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు మృతి


వీరాంజనేయులు మృతదేహం

చిన్నమండెం, జూలై16(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరకొరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశాపురం గ్రామ పంచాయతీకి చెందిన ఉసిరికాయల వీరాంజనేయులు (45), శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై రాయచోటి నుంచి కేశాపురానికి వెళుతుండగా దేవపట్ల క్రాస్ వద్ద మదనపల్లి డిపోకు చెందిన ఆర్డినరీ బస్సు ఢీకొంది. దీంతో తలకు గాయమై వీరాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులను తిరుపతిలోని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై ఇప్పటి వరకు తమకు ఎలాంటి సమాచారం లేదని ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

జిల్లాలో ఎరువుల కొరత లేదు.. జేడీఏ



రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న జేడీఏ చంద్రానాయక్

వేంపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులందరికీ సరిపడా యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల నిల్వల ఉన్నాయని, ఎక్కడ కొరత లేదని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు చంద్రానాయక్ తెలిపారు. పంటల సాగులో రైతులు అధిక మోతాదులో యూరియాను ఉపయోగించడం మానుకోవాలని, అధిక మోతా దులో యూరియా వాడకం వలన చీడపీడలు ఎక్కువ అవుతాయ న్నారు. వేంపల్లె వ్యవసాయ కార్యాలయంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరూ తమ పొలంలో భూసారపరీక్ష చేయించుకొని పరీక్షలకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని తెలిపారు. వరి సాగు చేసే రైతులు పాతరకాలను వదిలేసి కొత్తవంగడాలైన ఆర్ఎస్ ఆర్ 1502, కేఎస్ఎమ్ 1632 సాగు చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో ప్రత్యామ్నయంగా కంది వేసుకోవాలని సూచించారు. అరటి పంటకు యూరియా వేయడం వల్ల గాలులకు త్వరగా పడిపోతాయని, దిగుబడి తగ్గుతుందని తెలిపారు. 80శాతం సబ్సిడీతో డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయ అధికారిని కలిసి పొంద వచ్చన్నారు. పులివెందుల ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ శివశంకర్‌రెడ్డి, ఏఈఓ మల్లికార్జున, వినోద్, రైతులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్డు పనులు నాణ్యతగా చేపట్టండి



వాటర్‌షెడ్డు పనులను పరిశీలిస్తున్న
పీడీ ఆదిశేషారెడ్డి, రాష్ట్ర విజిలెన్స్ అధికారి గోపినాథ్

బి.కోడూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో వాటర్‌షెడ్డు పథకం కింద చేస్తున్న పనులను నాణ్యతగా చేయాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం పెదుళ్లపల్లె, మేకవారిపల్లె, ప్రబలవీడు గ్రామ పంచాయతీల్లో వాటర్‌షెడ్డు పథకం కింద చేస్తున్న పనులు, చేసిన పనులను రాష్ట్ర విజిలెన్స్ డైరెక్టర్ గోపినాధ్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ డకౌట్ గుంతలకు గజ్జి రాయి కటకం వేయరాదని, తెల్లరాయి, ఫైటింగ్‌రాయి మాత్రమే వాడాలన్నారు. వర్షం నీరు దిగువకు పారే వంకలో మాత్రమే చెక్‌ డ్యాంలు, డకౌట్ గుంతలు నిర్మించాలని, గుట్టల మీద, దిమ్మెల మీద చెక్‌డ్యాంలు, డకౌట్ గుంతలు నిర్మించరాదన్నారు. అలా చేస్తే బిల్లులు రావని, పనులు పక్కాగా నాణ్యతగా చేపట్టాలని తెలిపారు. అలాగే రైతులు వాటర్‌షెడ్డు పథకం కింద తమ తమ పొలాల్లో వాలు ప్రదేశంలో డకౌట్ గుంతలు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. వాటర్‌షెడ్డు పథకం కింద జరిగే పనులను వాటర్‌షెడ్డు అధికారులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్డు ఏపీవో వేణుగోపాల్‌రెడ్డి, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

భార్య, బామ్మర్ది చేతిలో వ్యక్తి మృతి



మృతి చెందిన సుబ్బరాయుడు

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యతో గొడవ పడుతున్న వ్యక్తిని అతని బావమరిది అడ్డుకోబోయి గట్టిగా తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి కడప నగరం ఎర్రముక్కప ల్లెలోని పల్లావారి వీధిలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి వివరాల మేరకు. ప్రొద్దుటూరు పట్టణంలోని ఇసుకలదిన్నె గ్రామానికి చెందిన దేవాంగుల సుబ్బరాయుడు (30) పదేళ్ల క్రితం అక్క కుమార్తె హర్షితను వివాహం చేసుకున్నారు. వీరికి 8 సంవత్సరాల కొడుకు, 7సంవత్సరాల పాప ఉంది. సుబ్బరాయుడు గ్రానైట్ పనులు చేసుకుంటూ ఎర్రముక్కపల్లెలోని పల్లావారి వీధిలో ఉంటున్నారు. సుబ్బరాయుడు అక్క కూడా సమీపంలో ఉంటున్నారు. సుబ్బరాయుడు రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతుండేవాడు. మంగళవారం రాత్రి కూడా ఫుల్లుగా మద్యం తాగి భార్య హర్షితతో గొడవ పడుతుండగా ఆమె తమ్ముడు హరిక్రిష్ణ ఇంట్లోకి వచ్చి బావకు నచ్చచెప్పే ప్రయత్నం చేశాడు. దీంతో అతన్ని కొట్టేందుకు వెళ్లగా వారిరువురూ గట్టిగా సుబ్బరాయుడును తోయడంతో కిందపడి తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. కాగా హరిక్రిష్ణను, హర్షితను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

పోలీసుల అదుపులో చైన్‌స్నాచర్లు?

కడప క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంతో పాటు పలుచోట్ల చోరీలకు పాల్పడ్డ చైన్ స్నాచర్లు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఒంటరిగా వెళుతున్న మహిళలను టార్గెట్ చేసుకుని వారి మెడలోని బంగారు గొలుసులు చోరీ చేసే ముగ్గురిని పోలీసులు సీసీ ఫుటేజీ ద్వారా గుర్తించినట్లు తెలుస్తోంది. కడప జిల్లాతో పాటు పలుచోట్ల వీరు గొలుసు దొంగతనాలకు పాల్పడి దోచుకున్న బంగారాన్ని ఎక్కడెక్కడ పెట్టారని విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రెండు మూడురోజుల్లో వీరిని అరెస్టు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది.

విద్యుత్తుషాక్‌తో వ్యక్తి మృతి



బద్వేలుటౌన్, జులై 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మహమ్మద్ సోను (28) విద్యుత్తుషాక్‌తో మృతి చెందా డు. పోలీసుల వివరాల మేరకు.. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మృతుడు మహమ్మద్ సోను ధర అనే అనిమేట్ కంపెనీ ద్వారా మున్సిపాలిటీలోని డంపింగ్ యార్డ్‌లోని చెత్తను రీసైక్లింగ్ చేసేందుకు ఆపరేటర్‌గా విధులకు వచ్చాడు. ఆ యంత్రాన్ని సరిచేస్తున్న సమయంలో బోర్డు దగ్గర కేబుల్ వైరు షాక్‌కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకొని కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలి

- వన్ కె వాక్‌లో జిల్లా ప్రధాన జడ్జి యామిని



వన్ కె వాక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన జడ్జి యామిని

కడప రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని డీఎల్ఎస్ చైర్మన్, జిల్లా ప్రధాన జడ్జి డాక్టర్ సి.యామిని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్ నుంచి నగరంలోని అంబేడ్కర్ సర్కిల్ వరకు.. అక్కడ నుంచి తిరిగి న్యాయసేవా సదన్‌కు మధ్యవర్తిత్వ ప్రాముఖ్యతపై వన్ కే వాక్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై జూలై 10 నుంచి 16 వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. నైపుణ్యంతో కక్షిదారుల సమస్యలను పరిష్కరించుకునే అవకాన్ని కల్పించే ప్రత్యేక ప్రక్రియే మధ్యవర్తిత్వమన్నారు. ప్రతి ఒక్కరు అవగాహనను పెంపొందించుకొని తద్వారా కేసులను సులువుగా పరిష్కరించుకోవాలన్నారు. మధ్యవర్తి అంగీకార పత్రంలో షరతులను కక్షిదారులకు వివరించి.. ఖరారు చేసి ఒప్పంద పత్రాన్ని తయారు చేస్తారన్నారు. మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, కేస్ స్టడీస్, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ, అరవ, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తులు గరికపాటి దీనబాబు, ఎన్.శాంతి, జి.రమేష్‌కుమార్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్, జడ్జిలు కె.ప్రత్యూషకుమారి, జి.సి.ఆసిఫా సుల్తానా, కె.భార్గవి, ఎం.ఈశ్వర్ వెంకటప్రసాద్, జి.విజయలక్ష్మి, కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, సెక్రటరీ చంద్రవదన, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కడప బార్ అసోసియేషన్‌లో మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ మాట్లాడారు. అలాగే న్యాయసేవా సదన్‌లో హిట్ అండ్ రన్ కేసులలో పరిహారం, చెల్లింపు తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో శ్రావణమాస ఉత్సవాలు విజయవంతం



గండి ఉత్సవాల బుక్‌లెట్లను విడుదల చేస్తున్న దృశ్యం

చక్రాయపేట,జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసద్ధిగాంచిన గండి క్షేత్రంలో శ్రావణమాసోత్సవాలను అన్ని శాఖల అధికారుల సహకారంతో విజయవంతం చేస్తామని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, చైర్మన్ కావలి కృష్ణతేజలు పేర్కొన్నారు. బుధవారం దేవస్థాన కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల బుక్‌లెట్‌లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రావణ మాస ఉత్సవాలకు జిల్లా నుంచే కాకుండా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్దఎత్తున వస్తారన్నారు. వారికి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా చలువ పందిళ్లు, క్యూలైన్‌లు, పాపాఘ్ని నదిలో భక్తులు స్నానాలు చేసేందుకు షవర్లు ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానంతో పాటు భక్తుల అన్నదాన కార్యక్రమాలు విరివిగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి కార్యాలయం నుంచి ఇన్‌స్పెక్టర్ సి.శివయ్య, ఆలయ మాజీచైర్మన్ వెంకటస్వామి, దేవస్థాన ప్రధాన అర్చకులు కేసరి, ఆలయ సూప రింటెండెంట్ సుభాష్, వైద్యాధికారి వాణి, సీఐ ఉలసయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గండిలో టెండర్లు : గండి క్షేత్రంలో ఏడాది పాటు పూలు విక్రయించుకునేందుకు, టోల్‌గేట్ వసూలుతో పాటు శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణకు సంబంధించి బుధవారం టెండర్లు నిర్వహించారు. పూల విక్రయానికి తొమ్మిది మంది పోటీ పడగా వేంపల్లె మండలం కత్తులూరు గ్రామానికి చెందిన టి.మల్లికార్జున రూ.20,05,000 పాట పాడి టెండర్‌ను దక్కించు కున్నారు. అయితే టోల్‌గేట్ వసూలుకు ఎవరూ ముందుకు రాలేదు. అలాగే శ్రావణ మాసం సందర్భంగా ప్రత్యేక పుష్పాలంకరణ చేసే హక్కునకు సీల్డ్‌టెండర్లు ఎవరు దాఖలు చేయలేదని, ఈ రెండు వాటికి టెండర్లు నిలిపివేశామని, ఈనెల 23న మళ్లీ నిర్వహిస్తామని ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు.

ఎరువుల తయారీ కేంద్రాలు, దుకాణాల్లో తనిఖీలు





కడపలో ఎరువులను పరిశీలిస్తున్న తనిఖీ బృందం, మైదుకూరులో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

కడప రూరల్, జూలై16 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఎరువులు తయారీ కేంద్రాలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల హోల్‌సేల్ దుకాణాల్లో బుధవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, కర్నూలు డీఆర్‌సీ ఏడీఏ ఎస్.వెంకటేశ్వర్లు, కడప జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో ఎస్.గోవర్ధన్, మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్‌రెడ్డి సంయుక్త బృందం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో రిజిష్టర్లను, స్టాక్ నిల్వలను పరిశీలించారు. కాలం చెల్లిన ఉత్పత్తులు ఏమైనా ఉన్నాయా లేదా అని పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించని 32 లక్షల విలువల గల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు డీలర్లతో మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన, అనుమతి కలిగిన ఎరువులను మాత్రమే విక్రయించాలన్నారు. ప్రతి రోజు స్టాక్ బోర్డు, ధరల పట్టికను అప్డేట్ చేసి ఉంచాలన్నారు. లైసెన్సులు లేకుండా వ్యాపారా లావాదేవీలు కొనసాగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మైదుకూరు మండలంలో...

మైదుకూరు రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల, పురుగుల మందుల దుకాణాలపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లిఖార్జున్‌రావు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాలలో రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. జీవిసత్రంలోని శ్రీశక్తి ట్రెడర్స్, శ్రీ వెంకటేశ్వర ఆగ్రో ఏజెన్సీస్, శ్రీనివాస ట్రేడర్స్, తిరుమల ఆగ్రో ఏజెన్సీస్‌లలో రికార్డులను అప్డేట్ చేయనందుకు అమ్మకాలు నిలుపుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ డీఆర్‌సీ ఏడీఏ సంగు వెంకటేశ్వర్ రావు, ఏడీఏ క్రిష్ణమూర్తి, మండల వ్యవసాయశాఖ అధికారి బాలగంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి హంతకులను శిక్షించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రొద్దుటూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థిని గంటికోటలో దారుణంగా హత్య చేసిన హంతకులను శిక్షించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని గాంధీ విగ్రహం వద్ద ఐద్వా ఆధ్వర్యంలో వైష్ణవిని హత్య మిస్టరీని ఛేదించి హంతకులను పట్టుకోవాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థి వైష్ణవి హత్య లాంటి సంఘటనలు జరగడానికి కారణాలు బహిర్గతం కావాల్సిన అవసరం వుందన్నారు. కార్యక్రమంలో గుర్రమ్మ ప్రమీల తదితర ఐద్వానాయకులు పాల్గొన్నారు.

సాగునీరు వదలడంలో అధికారుల నిర్లక్ష్యం : ఎంపీ

పులివెందుల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజకవర్గంలోని సాగునీటి అధికారులు ఏడాది కాలంగా నిర్లక్ష్యం వహించారని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మినీ సెక్రటేరి యట్‌లోని నీటి పారుదలశాఖ డీఈని ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలోని చెరువులకు నీటిని అందించే విషయమై చర్చించారు. ఎర్రబల్లె ఎరువు, భూమయ్యగారిపల్లె చెరువులకు నీరివ్వాలని కోరారు. అనంతరం ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గంలో నీటిపారుదల వ్యవస్థ సక్రమంగా లేదన్నారు. ఏడాదిగా నియో జకవర్గంలోని చెరువులను నీటితో నింపే కార్యక్రమం సక్రమంగా సాగడం లేదన్నారు. గండికోట, పైడిపాళెం ప్రాజెక్టులతో పాటు సీబీఆర్‌లో పుష్కలంగా నీరు ఉందన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు కూడా నిండు కుండలా ఉందన్నారు. అన్ని ప్రాజెక్టులు నీటితో కళకళలాడుతున్నా పులివెందుల నియోజకవర్గంలోని చెరువులకు నీరు అందించే పరిస్థితి లేదన్నారు. యర్రబల్లె చెరువుకు నీరు ఇవ్వకపోవడంతో చుట్టుపక్కల పది గ్రామాలపై ఈ ప్రభావం చూపుతుందన్నారు. సత్వరమే చెరువులకు నీరందించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైసీపీ నాయకులు బలరామిరెడ్డి, జడ్పీటీసీ బయపురెడ్డి, సాంబశివారెడ్డి తదితరులలు పాల్గొన్నారు.

నెల్లూరుపై అనంత జట్టు గెలుపు

- కర్నూలు, కడప మ్యాచ్ డ్రా
- మల్టీ డే క్రికెట్ టోర్నీ



రోహిత్‌రోషన్, కమ్రుద్దీన్, ప్రమోద్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై16(ఆంధ్రజ్యోతి): ప్రమోద్ కుమార్ ఆరు వికెట్లతో చెలరేగడంతో మల్టీ డే క్రికెట్ పోటీల్లో నెల్లూరు జిల్లా జట్టుపై అనంత జట్టు విజయం సాధించింది. నాలుగో రౌండ్ మల్టీ డే క్రికెట్ పోటీలు బుధవారం మూడోరోజు అనంతపురం నగరంలోని అనంత క్రీడాగ్రామంలో కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు 69.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌటైంది. అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌటైంది. నెల్లూరు ఓవర్‌నైట్ స్కోరు 243/5తో మూడోరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. 319 పరుగులకు ఆలౌటైంది. అనంత బౌలర్ ప్రమోద్‌కుమార్ 6 వికెట్లతో చెలరేగాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో ఆతిథ్య జట్టు 44.5ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 315 పరుగులు సాధించింది. రోహిత్‌రోషన్ హాఫ్ సెంచరీ(46 బంతుల్లో 72)లో ఆకట్టుకున్నాడు. దీంతో అనంత జట్టు 4వికెట్ల తేడాతో విజయం సాధించింది.

మరో గ్రౌండ్‌లో కర్నూలు-కడప జట్లు తలపడ్డాయి. కర్నూలు మొదటి ఇన్నింగ్స్‌లో 59.4 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌటైంది. మొదటి ఇన్నింగ్స్‌లో కడప 105 ఓవర్లలో 459 పరుగులకు ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు 74.1 ఓవర్లలో 268 పరుగులకు 7వికెట్లు కోల్పోయింది. కర్నూలు బ్యాటర్ కమ్రుద్దీన్ సెంచరీ (111)తో జట్టును ఆదుకున్నాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలి



ఇండస్ట్రియల్ ఎస్టేట్ సబ్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న ఎస్ఈ రమణ

కడప ఎర్రముక్కపల్లె, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల విద్యుత్ సమస్యపై వెంటనే స్పందించాలని జిల్లా విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ అన్నారు. బుధవారం కడప ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో సబ్‌స్టేషన్, లైన్లు ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. అనంతరం రూరల్ సబ్ డివిజన్ విభాగం సిబ్బందితో, అధికారులతో సమా వేశం నిర్వహించారు. వేల మందికి ఉపాధికల్పించే పారిశ్రామికవాడలో ఒక్క అంతరాయం ఏర్పడినా ఉత్పత్తి అనుకున్నంత మేర పొందలేరన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతం ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది, అధికారులను శాలువ, సర్టిఫికెట్లతో సన్మానించారు. కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ హరిసేవ్యానాయక్, డీఈఈ సుబ్రహ్మణ్యం, రామచంద్రారెడ్డి, ఏఈలు తదతరులు పాల్గొన్నారు.

ఉప్పలూరు గ్రామస్థుల దాతృత్వం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న గ్రామస్థులు

కాశినాయన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలూరు పీర్ల పండుగలో గాయాలపాలైన 11 మంది బాధితులకు బుధవారం గ్రామస్థులు రూ.2.15లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మొహర్రం పండుగ చివరిరోజైన గత ఆదివారం ఒకవైపు కోలాటాలు, మరోవైపు పీర్లకు ప్రత్యేక పూజలు నడుస్తున్నాయి.. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. అగ్నిగుండం పూడ్చే సమయంలో ప్రమాదవశాత్తు గుడం సమీపంలో కోలా టం తిలకిస్తున్న 11 మంది భక్తులపై వేడి బూడిద, అగ్ని రవ్వలు పడి కాళ్లు, చేతులు కాలి ఆసుపత్రుల్లో చేరారు. వీరందరికి గ్రామస్థులు తమ వంతు సాయంగా రూ.2.15 లక్షలు వసూలు చేసి అందజేశారు. మానవతా దృక్పథంతో గ్రామస్థులు అందించిన సహాయంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

తపాలా సేవలు మరింత వేగవంతం

- కడప డివిజన్‌లో సాంకేతిక 2.0 విధానం అమలు
- తపాలాశాఖ కడప డివిజన్ సూపరింటెండెంట్ రాజేష్



మాట్లాడుతున్న రాజేష్

కడప మారుతీనగర్, జులై 16 (ఆంధ్రజ్యోతి): తపాలా సేవలు మరింత వేగ వంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి రానున్నాయని కడప డివిజన్ సూపరింటెండెంట్ జి.రాజేష్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక తపాలా ప్రధా న కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తపా లాశాఖ ప్రజలకు మరింత నాణ్యమైన రీతిలో సేవలు అందించేందుకు అనువుగా కడప పోస్టల్ డివిజన్ పరిధిలో గల 451 తపాలా కార్యాలయా లలో ఈనెల 22వ తేదీ నుంచి సాంకేతిక 2.0 విధానం అమలు చేయను న్నట్లు వెల్లడించారు. ఈ కొత్త విధానంతో సాంకేతిక మార్పులతో తపాలా సేవల్లో వేగం, చరవాణి ద్వారా ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీల నిర్వ హణ తక్కువ సమయంలో ట్రాకింగ్‌తో వినియోగదారులకు అందు బాటులోకి రానుందన్నారు. ఈ విధానం అమలుకు అవసరమైన సన్నాహాల్లో భాగంగా ఈనెల 19 నుంచి 21 వరకు తపాలా కార్యా లయాల్లో సేవలను తాత్కాలికంగా నిలిపివేసి డేటా ట్రాన్స్‌ఫర్, సాంకేతిక మరమ్మతులు త్వరిత గతిన పూర్తిచేసి ఈనెల 22 నుంచి అన్ని తపాలా కార్యాలయాలలో పునఃప్రా రంభమై ప్రజలకు మెరుగైన సేవలు అందించనున్నామన్నారు. ప్రజలు తపాలా సేవలను అందిపుచ్చుకుని సహకారం అందించాలని కోరారు.

విద్యార్థుల హాజరు పెరగాలి

● డీఈవో సుబ్రమణ్యం


గురుకుల పాఠశాలలో భోజనాలను పరిశీలిస్తున్న డీఈవో సుబ్రమణ్యం

కలికిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల రోజువారీ హాజరు సంఖ్య గణనీయంగా పెరగాల్సి వుందని డీఈవో సుబ్రమణ్యం చెప్పారు. మండలంలోని మహల్ తెలుగు ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు తక్కువగా వుండటాన్ని గుర్తించారు. విద్యార్థుల హాజరు పెంచడానికి అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా సూచించారు. ఆగస్టులో జరిగే మొదటి ఎఫ్ఏ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని చెప్పారు. విద్యా శక్తి కార్యక్రమంఆనికి తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. అనంతరం ఆయన స్థానిక బీసీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థినులను విచారించారు. వంటశాలలో తయారయిన భోజనం, ఇతర కూరలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యా బోధన అంశాలకు సంబంధించి ప్రిన్సిపాల్ సోమశేఖర్ నుంచి వివరాలు రాబట్టారు. డీఈవో వెంట ఎంపీడీవో భానుమూర్తి రావు, ఎంఈవో కరీముల్లా, సీఆర్పీలు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం మోడల్ స్కూల్ హాస్టల్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రం సమీప ఏపీ మోడల్ స్కూల్‌లో ఉన్న బాలికల వసతి గృహాన్ని బుధవారం ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ తనిఖీ చేశారు. విద్యార్థినుల వసతి సౌకర్యంతో పాటు తాగునీరు, బాలికల స్నానపు గదులు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్, వంటగదికి వెళ్లి సరుకుల నాణ్యతను, కూరగాయలను పరిశీలించారు. క్రమం తప్పకుండా పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని వార్డెన్‌ను ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందించాలన్నారు. హాస్టల్‌లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గౌస్‌పీర్, ప్రిన్స్‌పాల్ శివకుమారితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


మోడల్ స్కూల్ హాస్టల్‌లో బియ్యం నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్

స్టాకు రిజిష్టరులో పెన్సిల్‌తో ఎలా రాస్తారు..

● అసంతృప్తి వ్యక్తం చేసిన మండల ప్రత్యేక అధికారి

నిమ్మనపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డివారిపల్లిలో వున్న మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు సరఫరా చేసే వస్తువుల వివరాలను స్టాకు రిజిష్టర్‌లో నెల రోజులుగా పెన్సిల్‌తో రాయడంపై మండల ప్రత్యేక అధికారి సతీష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా బుధవారం ఆయన ఎంపీడీవో రమేష్‌తో కలసి మోడల్ స్కూలును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల స్టాకు రిజిష్టరు, హాజరు పట్టికలను పరిశీలించారు. స్టాకు రిజిష్టర్‌లో పెన్సిల్‌తో రాస్తుండటంపై ప్రిన్సిపాల్ మూర్తిపై అగ్రహం వ్యక్తం చేశారు. ఎవరైనా స్టాకు రిజిష్టర్‌ను పెన్సిల్‌తో రాస్తారా.. ఇలా చేయడం వలన ఇంటి దొంగలే వస్తువులు మాయం చేసే అవకాశం వుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. గతంలో కూడా తాను తనిఖీలకు వచ్చినప్పుడు స్టాకు రిజిష్టర్ చూపించలేదని, ఇంత నిర్లక్ష్యం పనికిరాదన్నారు. అనంతరం హాస్టల్‌లోని విద్యార్థినులతో సమావేశమయ్యారు. విద్యార్థినులకు అందాల్సిన వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్‌కు ప్రహరీ గోడ కేటాయించి అదనపు గదులు నిర్మించాలని ప్రిన్సిపాల్ కోరారు. అనంతరం కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మునివెంకటమ్మ, ఎంఈవో-1 పద్మావతి, ఎంఈవో-2 నారాయణ, డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు తదితరులు పాల్గొన్నారు.


మోడల్‌స్కూలు హాస్టల్ విద్యార్థినులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

ముద్ద, బొబ్బల వ్యాధుల నుండి రక్షించుకోవాలి


ఆవుకు టీకాలు వేస్తున్న వైద్యుడు

నిమ్మనపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముద్ద చర్మ, బొబ్బల వ్యాధుల నుండి పశువులను రక్షించుకోవాలని మదనపల్లి డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు నీరజ అన్నారు. బుధవారం రాచవేటి వారిపల్లి పంచాయతీ గుండ్లపల్లిలో బొబ్బల వ్యాధి, ముద్ద చర్మ వ్యాధికి పశువైద్య సిబ్బంది వేస్తున్న ఉచిత టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువులలో అధిక ఉష్ణోగ్రత వలన చర్మం మీద బొబ్బలు రావడం, సరిగా మేపు తినకపోవడం, అలాగే పాల దిగుబడి తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయని తెలిపారు. పాడి రైతులు తప్పనిసరిగా నాలుగు నెలలు నిండిన ప్రతి ఆవుకు లంప స్కిన్ వ్యాధికి టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

నిమ్మనపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపల్లి పంచాయతీ మిట్టమీదపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీవో రమేష్‌ను కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ పైపులైన్ సమస్య కారణంగా దాదాపు రెండు నెలలుగా తాగునీరు రాలేదని, గతంలో ఉన్న పైపులైన్‌ను మార్చారని, అయినా తమ గ్రామానికి తాగునీరు రావడం లేదని వాపోయారు. వెంటనే ఆయన పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను పిలిచి సమస్యపై ఆరా తీశారు. ఎక్కడ సమస్య వుందో తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో బాలరాజు పాల్గొన్నారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు

బి.కొత్తకోట, జూలై 16(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని ఆకులవారిపల్లె శివారులో కోడిపందెం ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ జీవన్ గంగానాథ్ బాబు తెలిపారు. కోడిపందెం జరుగుతున్నట్టు బుధవారం సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారినుంచి రూ.5700 నగదు ద్విచక్రవాహనాలను సైతం స్వాధీనం చేసుకున్నామన్నారు.

మంత్రి లోకేష్‌ను కలసిన హజ్ కమిటీ సభ్యుడు



మదనపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్, రాయచోటి నియోజకవర్గ పరిశీలకుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ బుధవారం మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా ముస్లింమైనార్టీల సంక్షేమం, అబివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై వినతిపత్రం అందజేశారు.

కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన దొరస్వామినాయుడు


కార్పొరేషన్ చైర్మన్ దినేష్‌రెడ్డిని సన్మానిస్తున్న దొరస్వామినాయుడు

ములకలచెరువు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు దినేష్‌రెడ్డిని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ యువ నేత కట్టా దొరస్వామినాయుడు కలిశారు. ములకలచెరువులో బుధవారం ఆయన్ను కలిసి నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలు, టీడీపీ సంస్థాగత ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు.

నేడు రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ యోజనపై శిక్షణ

పీలేరు రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ గ్రామీణ స్వరాజ్ యోజన (ఆర్‌జీ ఎస్‌ఏ)పై గురువారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం న్విహిస్తున్నట్లు ఎంపీడీవో శివ శంకర్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆర్‌జీఎస్‌ఏ కార్యాచరణ ప్రణాళిక 2025-26, సామర్థ్య నిర్మాణం, శిక్షణ, పంచాయతీ పురోగతి సూచిక(పీఏఐ2.0)లపై మండల స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలి పారు. ఉదయం 10 గంటల నుంచి సా యంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుం దని, అన్ని శాఖల మండల స్థాయి అధికా రులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీ రింగ్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు హాజరు కావాలని ఎంపీడీవో తెలిపారు.

మధ్యవర్తిత్వం కేసుల పరిష్కారానికి చక్కని మార్గం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

తంబళ్లపల్లె, జూలై 16(ఆంధ్ర.జ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యంగా పరిష్కరించుకునేందుకు మధ్యవర్తిత్వం చక్కని మార్గమని జూనియర్ సివిల్ కోర్టు ప్యానెల్ అడ్వకేట్ గఫార్‌సాహెబ్ అన్నారు. బుధవారం స్థానిక సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు మండల కేంద్రంలోని సిద్దారెడ్డిగారిపల్లె ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు, ప్రజలతో మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అడ్వకేట్ గఫార్ సాహెబ్ మాట్లాడుతూ వాది, ప్రతివాది ఇరువురి సయోధ్య అంగీకారంతో కేసులు పరిష్కరిస్తారన్నారు. వివాహ వివాదాలు, ప్రమాద క్లయిమ్‌లు, గృహహింస, చెక్‌బౌన్స్ కేసులు, వాణిజ్య వివాదాలు, సర్వీస్ విషయాలు, క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, వినియోగదారుల వివాదాలు, భూసేకరణ తదితర కేసులను పరిష్కరించవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మహిళా మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బండమీదపల్లె తాగునీటి సమస్యపై విచారణ


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

బి.కొత్తకోట, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమిలేటికోట పంచాయతీ పరిధి బండమీదపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్యపై బుధవారం ఎంపీడీవో విచారణ చేపట్టారు. ఈనెల 14న బండమీదపల్లె గ్రామస్థులు ఎంపీడీవో కార్యాలయం వద్దకు చేరుకొని తమ గ్రామంలో తాగునీటి సమస్య పై అధికారులు స్పందించలేదంటూ గేటుముందు బైఠాయించి ధర్నా చేశారు. అప్పట్లో కార్యాలయంలో ఎంపీడీవో అందుబాటులో లేని కారణంగా బుధవారం గ్రామ అధికారులతో కలిసి బండమీదపల్లెకు వెళ్లి గ్రామస్థులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్న తాగునీటి పథక బోరునీటిని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయపొలానికి మళ్లించుకున్నట్లు గుర్తించారు. అక్రమంగా వాడుకుంటున్న నీటిని తక్షణం మళ్లించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. బండమీదపల్లెలో కొత్తబోరుకు ప్రతిపాదనలు పంపుతామని, అప్పటి దాకా బోరులో అదనంగా పైపులను దింపుతామన్నారు.

సీపీఐ మహాసభలను విజయవంతం చేయండి

బి.కొత్తకోట, జూలై 16(ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆవిర్భవించి వందేళ్ల పూర్తి అయిన సందర్భంగా మండలస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. బి.కొత్తకోటలో ఆగస్టు 3న నిర్వహించనున్న నియోజకవర్గస్థాయి మహాసభకు సంబంధించిన కరపత్రాలను స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ రాష్ట్రసమితి సభ్యుడు క్రిష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగస్టు 10, 11వ తేదీలలో మదనపల్లెలో జిల్లా మహాసభలు, 20-24 వరకు ఒంగోలులో రాష్ట్రమహాసభలు, సెప్టెంబరు 21-25 వరకు చండీఘడ్‌లో జాతీయ మహాసభలు పెద్దఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభలకు ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కేంద్రప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ చేస్తున్న పోరాటాలకు మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బషీర్‌ఖాన్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గలమ్మ బోనాలు


అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

రామసముద్రం, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బీసీ కాలనీలో వెలసిన దుర్గలమ్మ అమ్మవారికి బుధవారం మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు, బోనాలు మోసి మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం వేకువజాము నుంచే తరలి వస్తున్న భక్తులతో ఆలయ పరిసరాలు కళకళలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో మేళతాళాలతో ఊరేగించారు.

భక్తి పారవశ్యంతో అంజన్నకు భజనలు

కలకడ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎర్రకోటపల్లిలో కొలువైన కోటమిట్ట ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం భక్తులు భక్తి పారవశ్యంతో భజనలు చేశారు. అంతకు మునుపు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించి కొబ్బరికాయలు సమర్పించారు. గ్రామస్థులు పెద్దసంఖ్యలో కార్యక్రమాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

కలికిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన పౌష్టికాహార కిట్‌లను స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం సమకూర్చింది. టీబీ వ్యాధిగ్రస్తులుగా గుర్తించిన 15 మందికి బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబు పంపిణీ చేశారు. ఒక్కో పౌష్టికాహార కిట్‌లో ఒక నెలకు సరిపడే కిలో బెల్లం, కిలో రాగిపిండి, అర లీటరు ఆయిల్, అర కిలో కందిపప్పు, అర కిలో శనగల వంతున అందజేశారు. ఆరు నెలలపాటు ఇదే విధంగా అందరికీ ప్రతి నెలా ఈ కిట్లు అందజేయనున్నట్లు రెడ్డి సంక్షేమ సంఘం హామీ ఇచ్చింది. పౌష్టికాహారాన్ని వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, మేడికుర్తి వైద్యురాలు కావ్యగంధ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, సీహెచ్‌వో కృష్ణకుమారి, సంఘం సభ్యులు దొరబాబు రెడ్డి, అమరనాథ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ సూపర్ సిక్స్ పథకాలు


వాల్మీకిపురంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న కంభం నిరంజన్‌రెడ్డి

వాల్మీకిపురం, జూలై 16(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేదలందరికీ సూపర్ సిక్స్ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పీలేరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యాలయంలో కూటమి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలలో కొన్నింటిని అమలు చేసిందని, మిగిలినవి కూడా త్వరలోనే నిరుపేద కుటుంబాలకు అమలు చేయనుందన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సుపరిపాలన, సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు తెలిసేలా నాయకులు, కార్యకర్తలు సఖ్యతగా ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. వాల్మీకిపురం పట్టణం, మండలంలో రోడ్ల నిర్మాణం, డ్రేనేజీలు, తదితర అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, మంజూరైన తక్షణమే అభివృద్ధి పనులు చేపడతామన్నారు. మేజర్ గ్రామ పంచాయతీలైన వాల్మీకిపురం, చింతపర్తిల అభి వృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి, పీలేరు మైనార్టీ అధ్యక్షు డు సయ్యద్‌బాషా, నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రాచారి, ము రళి, శేషాద్రిరెడ్డి, కోసూరి రమేష్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న జయచంద్రారెడ్డి

చంద్రబాబు పాలనలో సంతోషంగా ప్రజలు

● టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 16(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, రాష్ట్ర పర్యావరణ నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ సంస్థాగత ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాయనిచెరువుపల్లెలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, సర్పంచ్ సంధ్యారాణి, నేతలు జనార్ధన్‌రెడ్డి, రెడ్డెప్ప, నాగిరెడ్డి, భజంత్రి రామాంజులు, రామప్ప, వీరభద్ర, చంద్రశేఖర్, సుబ్బినాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై పంచాయతీలకు ర్యాంకులు


మార్గదర్శకాలను వివరిస్తున్న కేంద్ర సభ్యుడు

కలికిరి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, మురుగునీటి నిర్వహణ, తడి చెత్త-పొడి చెత్త, కంపోస్ట్ తయారీ, మరుగుదొడ్ల వినియోగంపై సమగ్ర సర్వే జరిపి ఆయా పంచాయ తీలకు ర్యాంకులు కేటాయించనున్నట్లు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమానికి సంబంధించిన కేంద్ర బృందం సభ్యుడు గోవింద స్వామి తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని గుట్టపాలెం పంచాయతీలో జరుగుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను పరిశీలించారు. ర్యాంకులు కేటాయించడంలో వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకోనున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం గ్రామంలో సర్వేక్షణ్ అమలు గురించి ఆయన గ్రామస్తులను విచారించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్, రిసోర్స్ పర్సన్ శంకర్, పంచాయతీ కార్యదర్శి తిమ్మా రెడ్డి, ఇంజనీరింగ్ సహాయకులు అరుంధతి, హెచ్‌ఎం యల్లా రెడ్డి, ఉపాధ్యాయులు సురేంద్ర రెడ్డి, చంద్రశేఖర్, అంగన్‌వాడీ టీచర్ నూర్జహాన్, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సంఘమిత్రలు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఎక్సైజ్ విస్తృతదాడులు

● ముగ్గురు అరెస్టు

మదనపల్లె టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలోని బి.కొత్తకోట మండలంలో బెల్టుషాపులపై ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. బుధవారం ఎక్సైజ్ సీఐ భీమలింగ ఆధ్వర్యంలో సిబ్బంది బి.కొత్తకోట మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగసముద్రం రోడ్డు వద్ద డి.నారాయణపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు పప్పు రాజారెడ్డి(55)ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 12 ఆంధ్ర మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే బి.కొత్తకోట పట్టణం పాశంవీధిలో నరసింహులు కుమారుడు జి.శివ(37)ను అరెస్టు చేసి అతని వద్ద 11 ఆంధ్ర మద్యం బాటిళ్లు, నక్కరాసపల్లెలో వెంకటరమణ భార్య ఎన్.ఈశ్వరమ్మ(55)ను అరెస్టు చేసి ఆమె వద్ద 22 ఆంధ్ర మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా బెల్టుషాపులు నిర్వహిస్తే 9440902533 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా, హెచ్‌సీలు శ్రీనివాసులు, పీసీలు నాగరాజు, రేఖ, మధు, మణి తదితరులు పాల్గొన్నారు.

రైతు పనులకు ప్రాధాన్యత ఇవ్వండి

● ఏపీవో అంజనప్ప

తంబళ్లపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పించాలని ఏపీవో అంజనప్ప సూచించారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పండ్లు, పశుగ్రాసాల సాగుకు ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలపై రైతులకు వివరించి సాగు చేసేలా చైతన్యపరచాలన్నారు. అలాగే జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. రైతుల పొలాల్లో ఫారంపండ్స్, ఫిష్‌పాండ్స్ తవ్వుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పూర్తి అయిన పనులకు వెంటనే కొలతలు తీసి సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం చూపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి

గుర్రంకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో పరమేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. రైతు పొలాల్లో అభివృద్ధి పనులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. సిబ్బంది గ్రామాల్లో తిరిగి కూలీలు పనులకు కల్పించేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో జయరామిరెడ్డి, టీఏలు కుమార్, శేఖరమ్మ సిబ్బంది పాల్గొన్నారు.

ఆ రోడ్లకు అంచనాలు పంపండి

● సీఎంవో నుంచి పీఆర్‌కు ఆదేశం రూ.28లక్షలతో సీసీరోడ్లు మంజూరు

మదనపల్లె, జూలై 16(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం బసినికొండ-1, 2 పంచాయతీలోని మూడు రోడ్లకు అంచనాలు సిద్ధం చేసి పంపాలని సీఎంవో నుంచి పంచాయతీరాజ్‌శాఖకు ఆదేశాలు అందాయి. స్థానికంగా రోడ్లు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గంగన్నగారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు గంగారపు బాబురెడ్డి గతేడాది నవంబరు 21న సచివాలయంలో సీఎం చంద్రబాబునాయుడును కలసి వినతి పత్రం అందజేశారు. ఇందులో భాగంగా స్థానికులు ఇచ్చిన వినతి పత్రాలను కూడా సీఎంకు అందజేశారు. దీనికి స్పందించిన సీఎం ఆ మూడుప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీకి అంచనాలు రూపొందించి పంపాలని ఆదేశించారు. ఇందులో భాగంగా పుంగనూరు రోడ్డులోని గంగమ్మగుడి ఏరియా సదాశివనగర్‌లో సిమెంటు రోడ్డు, డ్రైనేజీకి రూ.20లక్షలు, బసినికొండ జన్మభూమికాలనీలోని ఉర్దూస్కూల్ వద్ద సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.20లక్షలు, బసినికొండలోని నిమ్మనపల్లెరోడ్డు శివాలయం దగ్గర సిమెంటురోడ్డు నిర్మాణానికి రూ.8లక్షలతో అంచనా రూపొందించారు. ఇందులో భాగంగా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, సిబ్బంది స్థానికులు కలసి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఎక్కడెక్కడ రోడ్లు వేయాలో, ఎంతమేర వేయాలో నిర్ణయించి సీఎంకు పంపారు.


సదాశివనగర్‌లో మంజూరైన సిమెంటు రోడ్డు ప్రాంతాన్ని స్థానికులతో కలసి పరిశీలిస్తున్న టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి